జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 204 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## అమెరికాలో ఎస్సార్ గ్రూప్ భారీ పెట్టుబడి..

**అయోవాలో రూ.1.4 లక్షల కోట్ల ఉక్కు కర్మాగారం స్వయంగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): భారతదేశానికి చెందిన ప్రముఖ కంపెనీ ఎస్సార్ గ్రూప్ అమెరికాలో భారీ పెట్టుబడికి సిద్ధమైంది. అమెరికాలో ఏకంగా 18 బిలియన్ డాలర్లపెట్టుబడి పెట్టాలని ప్రణాళిక వేసింది. ఇందులో భాగంగా అయోవా మిగతా 2లో..

## దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

**అసెంబ్లీ వద్ద ఘటనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం**

హైదారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ మిగతా 2లో..



# ఎన్నికలలో 'మ్యాచ్ ఫిక్సింగ్'

## ఈవీఎంలు, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు

- ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలి
- దేశంలో 13.30 కోట్ల ఓట్లను పునరుద్ధరించాలి
- సిఈసి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి
- వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం చేస్తాం
- సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం
- ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో సీడబ్ల్యూసీ సమావేశం
- ఎస్ఐఆర్ వివాదంపై కాంగ్రెస్ కీలక భేటీ
- సీఈసీ, కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ప్లాన్
- హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో మిగతా 2లో..

### తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు

# ఇప్పించండి

- పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వండి
- పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయండి
- కృష్ణా జలాల వినియోగంపై టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- మంత్రి సీఆర్ పాటిల్ తో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం

**రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అనుమతులపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం సమావేశమయ్యారు. ముఖ్యంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించి త్వరగా అనుమతులు వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మిస్తే ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చని పేర్కొన్నారు.**



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా మిగతా 2లో..



## తోటి సైనికులపై విచక్షణారహితంగా కాల్పులు

**ఘటనలో నలుగురు సీఐఎస్ఎఫ్ జవాన్లు మృతి**

**జమ్మూకశ్మీర్ సీఐఎస్ఎఫ్ క్యాంపులో జవాన్ ఘాతుకం**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని కఠువా జిల్లాలో ఓ సీఐఎస్ఎఫ్ జవాన్ ఘోరానికి పాల్పడ్డాడు. బసోలి ప్రాంతంలో ఉన్న క్యాంపులో విధులు నిర్వర్తిస్తున్న సీఐఎస్ఎఫ్ మిగతా 12లో..

## మయన్మార్‌లో వైమానిక దాడి..

**అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి**

**49 మంది మృతి, 58 మందికి గాయాలు**

మయన్మార్,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు.

మిగతా 12లో..



### సీఎంగా తొలిసారి సిరిసిల్లకు

# రేవంత్ రెడ్డి..

**నేడు సిరిసిల్లలో సీఎం భారీ బహిరంగ సభ**

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

రూ.345.78 కోట్ల పనులకు సిఎం శ్రీకారం

బహిరంగ సభపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి




హైదారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో సిరిసిల్ల ఇప్పుడు మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నేడు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి సిరిసిల్లకు రావడం ఒకవైపు అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుండటం మరోవైపు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, మిగతా 2లో..

## రాజకీయాల కోసం దేవుళ్లను విడతీస్తావా..

- సనాతన ధర్మంలో హరి, హరులకు భేదంలేదు
- సిఎం రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ ఆగ్రహం

హైదారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఉత్తర, దక్షిణ భారత రాజకీయ సంస్కృతిని ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము శివ భక్తులమని, ఉత్తరాదిలో రాముడి భక్తులు ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా, శివుడు పేదల దేవుడైతే, రాముడు మిగతా 2లో..






### పేదల కన్నీటికి

# విలువ కట్టలేం..

**ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం**

**పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం**

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

హైదారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ మిగతా 12లో..

## ధరణి పేరిట రికార్డులు తారుమారు

మా భూములను సర్వేనెంబర్ 325లో కలిపారు

సర్వేచేసి మా భూములు మాకు ఇప్పించండి

మంత్రి పొంగులేటికి వెంకటాపూర్ గ్రామస్థుల వేడుకోలు

క్షేత్రస్థాయి సర్వేతో వాస్తవాలు తేలుస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**భూ సమస్యపై సమగ్ర విచారణకు మంత్రి హామీ**

12 లో

### గరిష్ట స్థాయికి విద్యుత్

# వినియోగం

**2,044 మెగావాట్లకు చేరిన వాడకం**

**భారీగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలు**



హైదారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల నుంచి పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లు విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరిగింది. తాజాగా తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ( టీజీఎస్‌పీడీసీఎల్ ) పరిధిలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. మంగళవారం మధ్యాహ్నం 3.52 గంటలకు ఏకంగా 12,044 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. టీజీఎస్‌పీడీసీఎల్ చరిత్రలో ఇదే అత్యధిక డిమాండ్‌గా విద్యుత్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఇంతకుముందు అత్యధికంగా 11,828 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం 12.44 గంటలకు ఈ రికార్డు నమోదైంది. తాజాగా 12,044 మెగావాట్లకు డిమాండ్ చేరడంతో పాత రికార్డు అధిగమించబడింది. అంటే గత గరిష్ట డిమాండ్‌తో మిగతా 2లో..

# సంపాదకీయం

## పంటలపై ఎల్ నినో ప్రభావం!

ఎల్ నినో అంటే ఏమిటో అనుకున్నారు ఈ పేరు వినగానే ప్రజలు. కాని దాని ప్రభావం యావత్ ప్రపంచంపై కనిపిస్తుండడంతో ఎల్ నినో అంటే ఏంటో అర్థం అవుతుంది. నేడు ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పులకు కారణమయ్యే ఎల్ నినో ప్రభావం మరింత బలపడుతున్నట్లు తాజా అంచనాలు సూచిస్తున్నాయి. కొలంబియా యూనివర్సిటీకి చెందిన ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ అండ్ సొసైటీ ఈ మధ్య విడుదల చేసిన అంచనా ప్రకారం.. 2026 చివరి నాటికి, 2027 ప్రారంభంలో ఎల్ నినో పరిస్థితులు "చాలా బలమైన" స్థాయిలో కొనసాగవచ్చు. ఈ పరిణామం ఆసియా దేశాలతో పాటు భారత్‌లోనూ వాతావరణ సంబంధిత ప్రమాదాలను పెంచే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఎల్ నినో బలాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే ముఖ్యమైన సూచికల్లో నినో 3.4 ఇండెక్స్ ఒకటి. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను ఇది సూచిస్తుంది. ఐఆర్ఐ ప్రకారం 2026 సెప్టెంబర్ మధ్య నాటికి నినో 3.4 సూచిక ం3.0 డిగ్రీల సెల్సియస్కు చేరింది. ఆగస్టు నెలలో ఇది ం2.52 డిగ్రీలుగా ఉండగా, సెప్టెంబర్ మధ్య నాటికి మరింత పెరగడం ఎల్ నినో తీవ్రత వేగంగా పెరుగుతున్న సంకేతంగా కనిపిస్తోంది. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. ఐఆర్ఐ పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో మరింత బలపడే అవకాశాన్ని సూచించాయి. ఇందులో 13 డైనమిక్ మోడళ్లు, 9 స్టాటిస్టికల్ మోడళ్లు ఉన్నాయి. ఈ మోడళ్లన్నీ 2026-27 శీతాకాలంలో ఎల్ నినో "వెరీ స్ట్రాంగ్" స్థాయిలో ఉండొచ్చని అంచనా వేశాయి. కొన్ని మోడళ్లు నినో 3.4 ఉష్ణోగ్రత అసాధారణత ం3.0 డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశాన్ని కూడా సూచిస్తున్నాయి.ఎల్ నినో పరిస్థితులు 2027లోనూ కొనసాగే అవకాశాలు ఉన్నాయని × పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో అంచనా వేస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో ఉండే అవకాశం 100 శాతంగా ఉందని మోడల్ ఆధారిత అంచనా చెబుతోంది. 2027 మార్చి--మే కాలానికి ఈ అవకాశం 99 శాతంగా, ఏప్రిల్--జూన్ నాటికి 90 శాతంగా ఉండగా, మే--జూలై 2027లో 61 శాతానికి తగ్గుతుంది. అంటే 2027 మధ్య నాటికి ఎల్ నినో బలహీనపడే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం కొంతకాలం కొనసాగవచ్చని అర్థం. ఇదే సమయంలో ఇండియన్ ఓషన్ డైపోల్ ( పరిస్థితి కూడా భారత వాతావరణానికి కీలకంగా మారనుంది. పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో అంచనా ప్రకారం 2026 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు పాజిటివ్ × పరిస్థితులు బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత 2027 జనవరి నుంచి మార్చి మధ్య తిరిగి తటస్థ పరిస్థితుల వైపు వెళ్లవచ్చని అంచనా. ఎల్ నినో, పాజిటివ్ ఒకేసారి కనిపించడం సాధారణమే అయినప్పటికీ.. ఈ రెండు వాతావరణ వ్యవస్థలు స్వతంత్రంగా కూడా అభివృద్ధి చెందవచ్చని పరిశీలించిన మొత్తం 22 వాతావరణ నమూనాలు ఎల్ నినో స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఏడాది నెలకొన్న 'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రాబోయే రబీ (శీతాకాల) సీజన్‌లో వర్షాధార ప్రాంతాల్లో సాగు సవాలుగా మారే అవకాశముందని, దీనివల్ల దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడొచ్చని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన రబీ సీజన్ సన్నద్ధత జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇప్పటికే ముగిసిన ఖరీఫ్ సీజన్ కూడా వర్షాధార ప్రాంతాల్లో తీవ్ర సవాళ్లతో కూడుకుని సాగిందని, అనేక రాష్ట్రాలు విత్తనాలు నాటడం నుంచి పంటను కాపాడుకునే వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని గుర్తుచేశారు. అక్టోబర్ నెల నుంచి గోధుమ, ఆవాలు వంటి ప్రధాన రబీ పంటల విత్తే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో నేలలో అధిక తేమ, మరికొన్ని వర్షాభావ ప్రాంతాల్లో సుదీర్ఘ పొడి వాతావరణం పంటలపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఆయా ప్రాంతాలకు తగినట్లుగా వ్యవసాయ వ్యూహాలను మార్చుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. దేశంలో సాధారణంగా 638 లక్షల హెక్టార్లలో రబీ సాగు జరుగుతుంది. ఇందులో సుమారు 300 లక్షల హెక్టార్లలో గోధుమలు, 140 లక్షల హెక్టార్లలో పప్పుధాన్యాలు, 87 లక్షల హెక్టార్లలో నూనెగింజలు మరియు 55 లక్షల హెక్టార్లలో ముతక ధాన్యాలు పండిస్తారు. ధాన్యాల ఉత్పత్తిలో భారత్ స్వయంసమృద్ధి సాధించినప్పటికీ పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్ల దిగుమతులపై ఇంకా ఆధారపడుతోందని, దీనిని అధిగమించేందుకు 'పంటల వైవిధ్యీకరణ' అనివార్యమని ఆయన అన్నారు. 'ప్రతి చుక్కకూ అధిక పంట' మరియు నేల ఆరోగ్య కార్డుల వంటి సంక్షేమ పథకాలను కేవలం రాయితీల పంపిణీకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలను సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాలలో ఉన్న లోపాలను సరిచేసి రైతుల ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ధాన్యాల ఉత్పత్తిలో భారత్ స్వయంసమృద్ధి సాధించినప్పటికీ పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్ల దిగుమతులపై ఇంకా ఆధారపడుతోందని, దీనిని అధిగమించేందుకు 'పంటల వైవిధ్యీకరణ' అనివార్యమని ఆయన అన్నారు. 'ప్రతి చుక్కకూ అధిక పంట' మరియు నేల ఆరోగ్య కార్డుల వంటి సంక్షేమ పథకాలను కేవలం రాయితీల పంపిణీకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలను సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాలలో ఉన్న లోపాలను సరిచేసి రైతుల ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఏది ఏమైనా ప్రభావం తగ్గి సమృద్ధిగా వర్షాలు పడాలని అందరూ కోరుకుంటున్నారు. 22ఏ పేరుతోనే పెద్ద మోసం ,మూసి పేరుతో మోసం ,హైడ్రా పెరుటతో మోసం.. ఈ ప్రభుత్వమే మోసాలతో కోరుకున్న ప్రభుత్వం. రైస్ మిల్లరులపై ఇష్టానుసారంగా దాడులు. హైదరాబాదు నుండి సూర్యాపేట మీదుగా బులెట్ ట్రైన్ ను కమిషన్ల పైసలకోసం రూటు మార్చారు. స్కిల్ దేవోలపేమెంట్ యూనివర్సిటీకి వైస్ చౌ న్సిలర్ ఉండి దండగ. రైతుబంధు,రైతు భీమలేవు సంక్షేమ కార్యక్రమాలు లేవు,అభివృద్ధిలేవు. కేసీఆర్ ఉంటే నే మా బతుకులు బాగుపడుతావాని మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం ఎలా నడపాలో అవగాహన లేకపోతే తెలుసుకొని ప్రజల అవసరాలు తీర్చు. 97జీవో,22ఏ బంద్ చేసి తెలంగాణ ప్రజల అవసరాలు తీర్చాలని కోరారు.

## ఎన్నికలలో 'మ్యాచ్ ఫిక్సింగ్'

మొదటిపేజీ తరువాయి..

దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో రెండు రకాల 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని రాహుల్ ఆరోపించారు. ఒకటి ఈవీఎంలకు సంబంధించినదైతే, రెండోది ఓటర్ల జాబితాల్లో ఉద్దేశపూర్వకంగా మార్పులు చేయడమని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికలు పూర్తిగా ఫిక్స్, రిగ్డ్ అయ్యాయని కూడా ఆయన ఆరోపణలు చేశారు.

గత కొంతకాలంగా కాంగ్రెస్ ఓట్ చోరీ అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తోంది. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని పార్టీ ఆరోపిస్తూ వస్తోంది. మొదట్లో ఆ అంశాలపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేసినా, ఇప్పుడు మీడియా, సంపాదకీయాల్లో కూడా ఎన్నికల ప్రక్రియపై చర్చ జరుగుతోందని రాహుల్ చెప్పారు.

ప్రస్తుత ప్రభుత్వం ప్రజల గొంతును పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ భావిస్తోందని రాహుల్ గాంధీ సమావేశంలో చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని నమ్మే పార్టీలు ప్రతిఘటన మార్గంలో ముందుకు సాగాల్సిందేనని ఆయన అన్నారు. 1930లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాన్ని కూడా రాహుల్ గుర్తుచేశారు. అప్పట్లో పూర్ణ స్వరాజ్యం కోసం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుతం కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు వివరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న సర్ కూడా కాంగ్రెస్ ప్రధానంగా ప్రస్తావిస్తున్న అంశాల్లో ఒకటి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా కోట్లాది పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, సర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఈ అభ్యంతరాలు ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులు, ఫారం-6, ఓటర్ల డేటా నిర్వహణ వంటి అంశాలకు సంబంధించినవిగా ఆ నివేదిక పేర్కొంది. అయితే ఆ అంశంపై ఎన్నికల సంఘం మరో వివరణ ఇచ్చింది. సర్ తో పాటు ఇతర నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే జరిగాయని ఈసీ వర్గాలు స్పష్టం చేశాయి. కమిషనర్ల మధ్య అభిప్రాయాలు, ప్రశ్నలు ఉండటం సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. సమావేశంలో కాంగ్రెస్ పలు డిమాండ్లను ముందుకు తెచ్చింది. చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. అంతే కాదు, ఇప్పటి వరకు తొలగించినట్లు ఆరోపిస్తున్న 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరింది. ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా అంశాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. రాబోయే రోజుల్లో ఆ అంశంపై పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



కూడా హాజరైయ్యారు.


కాగా సమావేశానికి ముందు, ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ లతో కొద్దిసేపు ముచ్చటించారు. సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు వారు నిలుచుని ముచ్చటించుకుంటున్నట్లుగా ఉన్న ఫొటోను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ సంభాషణలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, శివకుమార్‌తో పాటు కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. కాగా, సీడబ్ల్యూసీ సమావేశంలో పలు జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించినట్లు రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక, ఆర్థిక వ్యూహాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల ప్రక్రియ సమగ్రతను దెబ్బతీస్తున్నాయన్న ఆరోపణలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు.

## దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

మొదటిపేజీ తరువాయి..

అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి



మొదటిపేజీ తరువాయి..

అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్-ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో ఎస్సార్ గ్రూప్ భారీ పెట్టుబడి..

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల ( సుమారు రూ.1.4 లక్షల కోట్లు) భారీ వ్యయంతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో రూయా కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్న ఎస్సార్ అమెరికన్ అనుబంధ సంస్థ 'మెసాబి మెటాలిక్స్' అయోవాలో నిర్మించే ఈ ప్లాంట్, అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారంగా నిలవనుందని ట్రంప్ అన్నారు. 2030 నాటికి ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్లాంట్, పూర్తయిన తర్వాత ప్రతి ఏటా 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయనుంది. ఈ కర్మాగారానికి అవసరమైన ఇనుప ఖనిజాన్ని మిన్నెసోటాలోని కంపెనీ కార్యకలాపాల నుంచి నేరుగా సరఫరా చేస్తారు. దీనివల్ల యునైటెడ్ స్టేట్స్‌లోనే పూర్తిస్థాయి ఉక్కు సరఫరా చైన్ ఏర్పాటవుతుంది.ఉక్కు దిగుమతులపై గతంలో తాను విధించిన 50 శాతం సుంకాల వల్లే అమెరికా ఉక్కు పరిశ్రమ వేగంగా పుంజుకుంటోందని ట్రంప్ అన్నారు. సుంకాలు చెల్లించకూడదనే ఉద్దేశంతోనే కంపెనీలు తమ ప్లాంట్లను నేరుగా అమెరికాలోనే నిర్మిస్తున్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అమెరికాలో తయారీ రంగానికి పెద్దపీట వేస్తున్నందుకు, ఈ అవకాశాన్ని కల్పించినందుకు మెసాబి మెటాలిక్స్ ఛైర్మన్ రేవంత్ రూయా ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. మెసాబి మెటాలిక్స్ సీఈఓ జో బ్రోకింగ్ మాట్లాడుతూ..నేషనల్ సెక్యూరిటీ, ఆటోమొబైల్స్, నౌకా నిర్మాణం, మౌలిక సదుపాయాలకు అవసరమైన కీలకమైన ఉక్కు అవసరాలను ఈ ఫ్యాక్టరీ తీరుస్తుందని పేర్కొన్నారు.1969లో భారతదేశంలో శశి రూయా, రవి రూయా సోదరుల చేత స్థాపించబడిన ఎస్సార్ గ్రూప్.. ఆయిల్, మైనింగ్, టెక్నాలజీ, రిటైల్ రంగాలలో విస్తరించింది. గుజరాత్‌లోని హజీరాలో దేశంలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని, వడినార్‌లో రెండో అతిపెద్ద రిఫైనరీని ఈ గ్రూప్ నిర్వహిస్తోంది. అంతేకాకుండా, యూకేలో షెల్ సంస్థకు చెందిన స్టాన్లో రిఫైనరీ కొనుగోలుతో పాటు, సౌదీ అరేబియాలో తక్కువ-కార్బన్ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసే ప్రణాళికల్లోనూ ఉంది.

## గరిష్ట స్థాయికి విద్యుత్ వినియోగం

మొదటిపేజీ తరువాయి..

పోలిస్తే తాజాగా మరో 216 మెగావాట్ల మేర విద్యుత్ అవసరం పెరిగింది. ఒక్కసారిగా వినియోగం పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి పెద్ద సాంకేతిక అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగినట్లు సంస్థ తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా విద్యుత్ వినియోగం గణనీయంగా నమోదవుతోంది. సెప్టెంబర్ 29 (మంగళవారం) సాయంత్రం 6.42 గంటలకు 4,072 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. అదే రోజు జీహెచ్ఎంసీ పరిధిలో 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధిక డిమాండ్ మే 22వ తేదీన నమోదైంది. ఆ రోజు సాయంత్రం 3.33 గంటలకు 4,782 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైంది. అదే రోజున 101.07 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. తెలంగాణ మొత్తం మీద కూడా విద్యుత్ అవసరాలు భారీగా పెరుగుతున్నాయి. తెలంగాణ ట్రాన్స్‌కో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 29 (మంగళవారం)న మధ్యాహ్నం 12.56 గంటలకు రాష్ట్రంలో 19,133 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా 326.70 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు తెలంగాణలో అత్యధికంగా 19,543 మెగావాట్ల డిమాండ్ సెప్టెంబర్ 9వ తేదీన ఉదయం 10.41 గంటలకు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాల కోసం కూడా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ముఖ్యంగా వరి సహా వివిధ పంటల సాగు, నీటిపారుదల అవసరాల కోసం విద్యుత్ సరఫరాపై డిమాండ్ పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో సరఫరా వ్యవస్థను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక పట్టణ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య అవసరాలతో పాటు పారిశ్రామిక కార్యకలాపాలు, ఐటీ సంస్థలు, ఇతర వ్యాపార సంస్థల కారణంగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ప్రసార-పంపిణీ వ్యవస్థలను ఆధునీకరించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు.

## సీఎంగా తొలిసారి సిరిసిల్లకు రేవంత్ రెడ్డి..



ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విద్య, ఆలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులు, మహిళా సాధికారత, నేతన్నల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు ఉన్నాయి. సిరిసిల్లకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వేములవాడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో సుమారు 18 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు వసతి, తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్, క్రీడా సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు కల్పించనున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కూడా సీఎం రేవంత్ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. ఆలయ విస్తరణ, మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, సైట్ డెవలప్‌మెంట్, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ పనులు, షాపింగ్ కాంప్లెక్స్, రోడ్ల నిర్మాణం వంటి పనులకు సంబంధించిన 26 పనులకు రూ.99.40 కోట్ల అదనపు నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. దీంతో ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు మంజూరైన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరాయి. జిల్లాలో పరిపాలనా మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కొత్త ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికీ సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడలో ఆర్డీవో కార్యాలయాలు, పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాలు ఇందులో ఉన్నాయి. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు. ఇక.. సిరిసిల్ల అంటేనే చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమ. అందుకే సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో నేతన్నల అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో 'నేతన్న బజార్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా సిరిసిల్లలో పవర్‌లూమ్‌లపై ఉత్పత్తి అయ్యే పెట్టీకోట్, పాలియెస్టర్ వస్త్రాలకు మార్కెట్ కల్పించడమే దీని ఉద్దేశంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ ప్రాజెక్టుకు తుది మంజూరు, వ్యయం ఇంకా ఖరారు కాలేదని అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. ఇదే సమయంలో నేతన్నలకు బకాయిలు, వస్త్ర ఆర్డర్లు, బతుకమ్మ చీరల పథకం వంటి అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నేతన్నలకు గత ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్ల బకాయిలు మిగిలాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లకు వస్త్ర ఆర్డర్లు ఇచ్చిందని ఆయన చెబుతున్నారు. రేవంత్ పర్యటనకు ముందు కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడంతో సిరిసిల్ల పర్యటనకు రాజకీయ కోణం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని.. అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్లు, ఎంత విస్తీర్ణం, ఎవరి పేర్లపై భూములు ఉన్నాయో ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఆ ఆరోపణల్లో వాస్తవం ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని.. నిరూపించలేకపోతే సిరిసిల్ల ప్రజలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నేతన్నల బకాయిలు, రైతు భరోసా, రుణమాఫీ, బతుకమ్మ చీరల పథకం, సిరిసిల్ల అభివృద్ధి వంటి అంశాలపై కూడా రేవంత్ సమాధానం చెప్పాలని కోరారు. సిరిసిల్లలో సీఎం పర్యటనను కాంగ్రెస్ వర్గాలు అభివృద్ధి కార్యక్రమంగా వివరిస్తున్నప్పటికీ.. రాజకీయంగా మాత్రం ఈ పర్యటనపై ఆసక్తి నెలకొంది. కారణం.. ఇది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడమే. ఇక ఇటీవల ఈనెల 5వ తేదీన నకిరేకల్ సభలో ప్రసంగించిన రేవంత్‌రెడ్డి.. సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో తాను త్వరలోనే పర్యటిస్తానని ప్రకటించారు. సిరిసిల్ల తర్వాత సిద్ధిపేటకు వెళ్లనున్నట్లు ఆయన అప్పట్లో చెప్పారు. సిరిసిల్ల కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కాగా.. సిద్ధిపేట హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. అటు గజ్వేల్ ఎమ్మెల్యేగా మాజీ సీఎం కేసీఆర్ ఉన్నారు. సిరిసిల్లలో రేవంత్ భారీ సభ నిర్వహించనుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. భారీ జనసమీకరణకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్‌షో, బహిరంగ సభ, మంత్రులు, స్థానిక నాయకుల పాల్గొనడం వంటి అంశాలతో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యల్లో మాత్రం రాజకీయ టోన్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లపై కాంగ్రెస్ వరుసగా దృష్టి పెడుతోందని అన్నారు. మరో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. సీఎం సిరిసిల్ల పర్యటనతో కేటీఆర్ గత పాలనకు సంబంధించిన అంశాలు చర్చకు వస్తాయని వ్యాఖ్యానించారు.

## రాజకీయాల కోసం దేవుళ్లను విడతీస్తావా..

మొదటిపేజీ తరువాయి..

సంపన్నుల దేవుడని చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. భారతీయ జనతా పార్టీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాముడిని ఉపయోగించుకుంటోందని, జై శ్రీరామ్ అంటూ లబ్ధిపొందుతూ రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయాల కోసం దేవుళ్లను, ప్రాంతాలను వర్గాలుగా విడదీయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణలోనే రాముడు, శివుడు ఇద్దరికీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయని ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తుచేశారు. వేములవాడను దక్షిణ కాశీగా, అదే విధంగా భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా భక్తులు ఆరాధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. రాముడు, శివుడి ఏకత్వానికి ప్రతీకగా నిలిచే హరిహర క్షేత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండలో ఉందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చేసిన నార్త్-సౌత్, రాముడు-శివుడు అనే రాజకీయ విభజన అబద్ధమని నిరూపించేందుకు తెలంగాణలోని ఈ ఆధ్యాత్మిక క్షేత్రాలే సరైన సమాధానమని బండి సంజయ్ స్పష్టం చేశారు. అలాంటి ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ఉండి రాముడు, శివుడిని ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు పరిమితం చేస్తూ ప్రజలను, ప్రాంతాలను ఎలా విడదీస్తారని బండి సంజయ్ ప్రశ్నించారు. సనాతన ధర్మంలో హరి, హరులకు భేదం లేదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి మతపరమైన అంశాలను, గుర్తింపులను తెరపైకి తెస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వ్యక్తికి సర్పంచ్ పరామర్శ



**ఉట్నూర్, సెప్టెంబర్, 29 (ప్రజా జ్యోతి) :** ఉట్నూరు మండలం బాబాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజులగూడ గ్రామానికి చెందిన సుర్పం శ్యాంరావు అనారోగ్యంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మేస్రం గంగాదేవి ప్రభాకర్ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్యాంరావు ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ తో అడిగి తెలుసుకునన్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనారోగ్య పరిస్థితుల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కారణంగా పెన్షన్ ధ్రువీకరణ ప్రక్రియకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సంబంధిత చేయూత పెన్షన్ ధ్రువీకరణ అధికారి ఎ. మనోజ్‌రెడ్డిని ఆసుపత్రికి తీసుకెళ్లి, అక్కడే శ్యాంరావుకు పెన్షన్ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న వ్యక్తి పరిస్థితిని గుర్తించి, పెన్షన్ కోసం అవసరమైన ధ్రువీకరణను ఆసుపత్రిలోనే చేయించిన సర్పంచ్ గంగాదేవి ప్రభాకర్ చొరవపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

## కబడ్డీలో ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సత్తా...

– జోనల్ స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక..



**ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) :** ఇచ్చోడ జడ్పీఎస్ఎస్‌లో నిర్వహించిన పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఝరిపూన గూడ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై సత్తా చాటారు. 9వ తరగతి విద్యార్థి టి. అర్జున్ అండర్--17 బాలుర విభాగంలో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి ఆసిఫాబాద్‌లో జరగనున్న జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అదే తరగతికి చెందిన టి.ఆనంద్‌రావు అండర్--14 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచి ఇచ్చోడలో జరగనున్న జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సరస్వతి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన శిక్షణ అందించి వారి ప్రతిభను వెలికితీస్తున్న పాఠశాల శారీరక విద్యా ఉపాధ్యాయుడు రాథోడ్ శ్రీనివాస్‌ను హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. జోనల్ స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సింగరేణి బకాయిలు రూ.55 వేల కోట్లు చెల్లించాలి

– నేడు సీసీసీ కార్నర్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా
– బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి





**మంచిర్యాల, 29, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు బకాయి ఉన్న రూ.55 వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద నిర్వహించనున్న "సింగరేణి బకాయి బీజేపీ లడాయి" ధర్నా కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధర్నా నిర్వహించనున్న స్థలాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. ఆర్థిక వనరుల కొరత కారణంగా సింగరేణి నూతన గనులను ఏర్పాటు చేయలేకపోతోందని, కార్మికుల భద్రతకు అవసరమైన బూట్లు, పని ముట్లు, టోపీలు వంటి రక్షణ పరికరాలను కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణి సంస్థ పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న ధర్నాకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌తో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, సత్రం రమేష్, కుర్రే చక్రవర్తి, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, కమలం రావు, బేరా సత్యనారాయణ, కమలాకర్ రావు, పొన్నవేణి సదయ్య, మల్కా రాజేశం, బుద్దే రవి, బద్రి శ్రీకాంత్, బూర్ల చిరంజీవి, కొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం' నిధుల విడుదల ఎప్పుడు?

బీఆర్ఎస్ నాయకుడు సాబ్లే సంతోష్ సింగ్ డిమాండ్



**నేరడిగొండ, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలుపై స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకుడు సాబ్లే సంతోష్ సింగ్ డిమాండ్ చేశారు. పథకం ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తారు? ఎన్ని విడతల్లో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని కోరారు.

ఈ సందర్భంగా సంతోష్ సింగ్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల మంజూరు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీ, నిధుల విడుదల వంటి ప్రక్రియలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పథకం కింద తొలి దశలో రూ.1 లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తొలి విడతలో ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారు? జిల్లాల వారీగా ఎంతమందికి ప్రయోజనం కల్పిస్తారు? మిగిలిన దరఖాస్తుదారులకు ఎప్పుడు అవకాశం కల్పిస్తారు? అనే విషయాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.

యువతకు హామీలు కాకుండా చేతిలో ఆర్థిక సహాయం, జీవితంలో ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందని సంతోష్ సింగ్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా బ్యాంకు రుణాలు, సబ్సిడీ, యూనిట్ మంజూరు ప్రక్రియలను వేగవంతం చేయాలని కోరారు.జిల్లాల వారీగా స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించి, లబ్ధిదారుల ఎంపిక, నిధుల విడుదల తేదీలను తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని సాబ్లే సంతోష్ సింగ్ ప్రభుత్వాన్ని కోరారు.

## పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- రైతులకు ఇబ్బందులు లే కుండా పారదర్శకంగా కొను గోళ్లు
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 29,(ప్రజా జ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా నిర్వ హించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా



కలెక్టర్ రాజర్షి షా అధికారు లను ఆదేశించారు. పత్తి కొనుగోళ్ల ముందస్తు ఏర్పా ట్లపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అ ధికారులు, సీసీఐ ప్రతినిధు లు, జిన్నింగ్ మిల్లుల యజ మానులు, రైతు సంఘాలప్ర తినిధులతో సమీక్షాసమా వే శం నిర్వహించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ అక్టోబర్ రెండో వారం లో సీసీఐ, ప్రైవేట్ ఆధ్వ ర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రా రంభించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిన్నింగ్ మి ల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, రైతులను సంబంధిత మిల్లులకు ట్యా గింగ్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీ రు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర కనీస సౌక ర్యాలు కల్పించాలని ఆదే శించారు. పత్తి కొనుగోలుకేం ద్రాల్లో మాయిశ్చర్ మీటర్ల ను సక్రమంగా వినియోగిం చేలా వీఓలు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇ వ్వాలని సూచించారు. రై తులు, వీఓలు, గ్రేడర్లతో స్థానిక పర్యవేక్షణ కమిటీ లను ఏర్పాటు చేసి తేమ శాతం కొలతల్లో పారదర్శ కత పాటించాలని తెలిపా రు. ప్రతి కొనుగోలు కేంద్రం లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయ, మార్కె టింగ్, సీసీఐ అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పత్తి రవా ణాకు సంబంధించి ఆర్ అం డ్ బీ, జాతీయ రహదారు లు, గ్రామపంచాయతీ రహ దారుల పరిస్థితిని సమీక్షిం చి అవసరమైన మరమ్మతు లు చేపట్టాలని కలెక్టర్ సూ చించారు. మార్కెట్ యార్డు ల్లో తూకం, షెడ్లు, నీరు తది తర సౌకర్యాలను ముందు గానే సిద్ధం చేయాలని ఆదే శించారు. ఎస్పీ అఖిల్ మ హాజన్ మాట్లాడుతూ, జి న్నింగ్ మిల్లుల్లో కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేసే ప్రాంతా లు, ప్రవేశ ద్వారాల వద్ద సీ సీ కెమెరాలు 100 శాతం ప నిచేసేలా చూసి రికార్డులను భద్రపరచాలని సూచించా రు. పత్తి మిల్లుల్లో అగ్నిప్ర మాదాల నివారణకు అవ సరమైన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని, ని బంధనలు పాటించని వారి పై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చిన్న ట్రేడ ర్లు, మధ్యవర్తుల ప్రమేయా నికి తావులేకుండా రైతుల నుంచే కొనుగోళ్లు జరిగేలా చూడాలని సూచించారు. గతేడాది కంప్యూటర్ ఎంట్రీ ల సమయంలో చోటుచేసు కున్న పొరపాట్లు పునరా వృతం కాకుండా సిబ్బందికి త గిన శిక్షణ ఇవ్వాలని





తెలిపారు. పత్తి కొనుగోళ్ల సీజన్‌లో అన్ని శాఖల అధికారులుస మన్వ యంతో పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూ చించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లా డుతూ, మార్కెట్‌కు వచ్చే రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కో రారు. మార్కెట్ పరిసరాల్లో మున్సిపాలిటీ, జిన్నింగ్ అ సోసియేషన్, సీఎస్ఆర్ ని ధులతో సీసీ కెమెరాలు ఏ ర్పాటు చేయాలని, సీజన్ పూర్తయ్యే వరకు రాత్రివేళ పోలీసు పెట్రోలింగ్ నిర్వ హించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు, ఎన్ఓసీలు, అగ్నిమాపక పరికరాల పని తీరును తనిఖీ చేయాలని కోరారు.మున్సిపల్ చైర్ ప ర్సన్ బండారి అనూష మా ట్లాడుతూ, మార్కెట్ యార్డు కు వచ్చే మహిళా రైతులకు ప్రత్యేక టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కో రారు. మార్కెట్ సమీపం లో ని ప్రాంతాల దృష్ట్యా రైతు లు, మహిళలకు భద్రత క ల్పించేలా పోలీసు బందోబ స్తు ఏర్పాటు చేయాలని సూ చించారు. వర్షాల కారణంగా పత్తి తడిసి రైతులు నష్టపో కుండా మార్కెట్‌కు తీసుకొ చ్చిన పత్తిని సకాలంలో కొనుగోలు చేసేలా చర్యలు తీ సుకోవాలని కోరారు. పలు వురు రైతు సంఘాల నాయ కులు మాట్లాడుతూ జిల్లా లోని మార్కెట్ యార్డుల్లో రై తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగే లా చూడాలని కోరారు. అ నంతరంగణేష్ నిమజ్జనం ప్ర శాంతంగా నిర్వహించి నం దుకు గాను జిల్లా కలెక్టర్, ఎ స్పీ ని పలువురు రైతు సం ఘాల నాయకులు శాలువా లతో సత్కరించారు.ఈ స మావేశంలో అదనపు కలె క్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ కొయ్యాడ ప్ర ణయ్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానంద్, జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి రవీం దర్ సింగ్, సి సి ఐ బ్రాంచ్ మేనేజర్ పునీత, డీఎస్పీ జీ వన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజ మానులు, కమిషన్ ఏజెం ట్లు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియే షన్ ప్రతినిధులు, వ్యవసా య, మార్కెటింగ్ శాఖల అ ధికారులు, రైతు సంఘాల నాయకులు, రైతులు తది తరులు పాల్గొన్నారు.

### విద్యా ఒత్తిడిని జయించేందుకు

## విద్యార్థులకు ప్రేరణ తరగతులు







**మంచిర్యాల, 29, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు "విద్యా ఒత్తిడి--కారణాలు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం--జయించే వ్యూహాలు" అనే అంశంపై మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం హాజీపూర్ మండలం రాంపూర్ ఆవాస విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు టీపీఏ సైకాలజిస్ట్ భూపతి నారాయణరావు ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల రామన్న మాట్లాడుతూ.. గోల్ సెట్టింగ్, ముందస్తు ప్రణాళిక, శ్రద్ధతో చదవడం ద్వారా విద్యార్థులు విద్యా ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. సైకాలజిస్ట్ నారాయణరావు కథలు, పాటల ద్వారా విద్యార్థులకు చక్కటి ప్రేరణ అందించారు. చదువును ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తూ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే ఒత్తిడిని తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే మొబైల్ అడిక్షన్ విద్యార్థుల్లో ఒత్తిడికి కారణమవుతుందని, అవసరమైన మేరకే సాంకేతికతను వినియోగించుకోవాలని మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో పదో తరగతికి చెందిన సుమారు 70 మంది విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు రావుల రామన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

**మంచిర్యాల, 29, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని గత 40 సంవత్సరాలుగా ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. బీసీల ఉద్యమాలను గౌరవించిన అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996, 2006, 2010 సంవత్సరాల్లో బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానాలు చేసి పంపించారని, 2014 తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. దేశ జనాభాలో సుమారు 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం 14 శాతం కూడా లేదని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటివరకు అనేకసార్లు రాజ్యాంగ సవరణలు చేసిన





కేంద్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్ల కోసం ఒక్కసారి రాజ్యాంగ సవరణ చేయకపోవడం బాధాకరమన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు పూర్తవుతున్నా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకపోవడం బీసీలపై వివక్షకు నిదర్శనమని ఆయన అన్నారు. ఎలాంటి ఉద్యమం లేకుండానే అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్ర ప్రభుత్వం, బీసీల న్యాయమైన డిమాండ్‌ను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బీసీలు రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని చూపడం సరికాదని అన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించి పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మంచర్ల సదానందం, సీనియర్ న్యాయవాది అరె లచ్చన్న, గజ్జెల్లి వెంకటయ్య, శాఖపురం భీమాసేన్, పెద్దపెల్లి సూరయ్య, పెద్దల చంద్రకాంత్, అంకం సతీష్, కీర్తి బిక్షపతి, పోశం, వేముల కిరణ్, పిట్టల దశరథం, రవిశంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన ప్యానెల్ బృందం





**బోథ్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ప్యానల్ కమిటీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బృందం కళాశాలలోని తరగతుల నిర్వహణ, రికార్డు రిజిస్టర్‌లు, లైబ్రరీ, ల్యాబరేటరీ రూములను పరిశీలించి పలు సూచనలు సలహాలతో పాటుగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లుగా తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనురాధ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శోభ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## అంతక్రియల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**సోనాల, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ సోదరుడు తుల వెంకట్ రెడ్డి రిటైర్డ్ టీచర్ స్వర్గస్తులవగా మంగళవారం రోజు వారి అంతక్రియలు స్వగ్రామం సోనాలలో నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి వారి భౌతికకాయానికి నివాళు లర్పించారు.



## నస్పూర్‌లో ఎన్‌సీడీ వైద్య శిబిరం

– ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి
– కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్

**మంచిర్యాల, 29, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** నస్పూర్ పీహెచ్‌సీ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో నాలుగో డివిజన్‌లో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ సాయి ప్రణతి, డాక్టర్ ఎన్. వెంకటేష్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు టైఫాయిడ్, డెంగీ, మలేరియా తదితర సాధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు అవసరమైన మందులు నస్పూర్ ప్రభుత్వ వైద్య కేంద్రంలో అందుబాటులో ఉంటాయని, వివిధ రకాల పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. పేద ప్రజలు అనవసరంగా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డెంగీ, మలేరియా లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రెండు రోజులకు మించి జ్వరం కొనసాగితే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవడంతో పాటు సమీపంలోని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. మహిళలకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు అవసరమైన పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చిన్నారులకు మాతా శిశు సంరక్షణలో భాగంగా సబ్ సెంటర్‌లో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వాతి, ఆశా కార్యకర్తలు కె.స్వర్ణలత, ఏ.శ్యామల, బి.శ్రీదేవి, జి.శారద, జె. భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సహకారంతో ఆర్‌కే-6, లక్ష్మీనగర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.





# రక్త నిల్వలకు కొరత రాకూడదు

- రక్తదానానికి విస్తృతంగా చేయూత

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 29 (ప్రజాజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన రక్తం జిల్లా బ్లడ్ బ్యాంకులో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్లో జిల్లా




రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి డీపీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారికి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రియాంక, కోశాధికారిగా చిన్న గోవిందు విష్ణువర్ధన్, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఎల్ల భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అంకితభావంతో పనిచేస్తూ తరచూ రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో రక్తం కొరత రాకుండా నిల్వలు ఉండేలా చూడాలని, జిల్లాలో అధిక సంఖ్యలో రెడ్‌క్రాస్ సభ్యత్వం నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ హృదయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ

ఆలంపూర్ సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి) వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు జమ్మలమడుగు ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కౌన్సిలర్ డాక్టర్ .విజయభాస్కర్ ఆధ్వర్యంలోఏఐ స్టెతస్కోప్ హార్ట్ చెకప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో , మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు , మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ పాల్గొని హార్ట్ చెకప్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు ఏ.ఐ స్టెతస్కోప్ ద్వారా వడ్డేపల్లి శ్రీనివాసులు కి హృదయ పరీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హృదయ ఆరోగ్యాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పించడం అభినందనీయమని వారు





తెలిపారు. ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై అవగాహన కలిగి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా వడ్డేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి కూడా ఏఐ స్టెతస్కోప్ పరికరాన్ని స్పాన్సర్ చేస్తామని వడ్డేపల్లి శ్రీనివాసులు ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. ప్రజలకు మరింత అందుబాటులో ఆధునిక హృదయ ఆరోగ్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో ఈ పరికరాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. గుండె ఆరోగ్యం ప్రతి ఒక్కరి బాధ్యత – ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండెను కాపాడుకుందాం" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ తిమ్మప్ప, గార్లపాడు నాగభూషణ్, వడ్డేపల్లి డాక్టర్ స్వప్న, వడ్డేపల్లి ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, వార్డు ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

-మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ హెచ్చరిక

చిన్నంబావి,సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్నంబావి మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వెలగొండ గ్రామంలో సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా సీడ్ యాక్ట్–1966, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, ఇన్సెక్టిసైడ్ యాక్ట్–1968 ప్రకారం డీలర్లకు పలు



సూచనలు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయించరాదన్నారు. కాలం చెల్లిన, నిషేధిత పురుగు మందులను విక్రయించ కూడదని స్పష్టం చేశారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు, ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని, రైతులకు కొనుగోలు చేసిన ప్రతి ఉత్పత్తికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.యూరియా, డీఏపీ తదితర ఎరువులతో ఎలాంటి లింక్ ప్రొడక్టులను విక్రయించరాదని హెచ్చరించారు. వ్యాపారులు ఎరువులను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. దుకాణాల్లో రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎరువుల బుకింగ్ కోసం రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విక్రయించే నకిలీ డీఏపీ, ఎరువులు, పెస్టిసైడ్స్‌ను రైతులు కొనుగోలు చేయవద్దని డాకేశ్వర్ గౌడ్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై సంబంధిత చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ ఓటు కావాలంటే.. కొత్తగా దరఖాస్తు!

- ఫారం-18తో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అవకాశం
- నవంబరు 6 చివరి గడువు

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 29 (ప్రజాజ్యోతి): మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఓటర్ల జాబితా నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో ఓటరుగా నమోదు అయి ఉన్నప్పటికీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఫారం–18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026 నవంబరు 1 నాటికి మూడు సంవత్సరాల కంటే ముందే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.




నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరణ

అర్హులైన పట్టభద్రులు నవంబరు 6లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా చిరునామా ధ్రువీకరణ పత్రం, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ చూపించాల్సి ఉంటుందన్నారు. నవంబరు 25న ముసాయిదా జాబితా అర్హులైన ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాను నవంబరు 25న విడుదల చేస్తామని తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు స్వీకరిస్తామని, వాటిని డిసెంబరు 25లోగా పరిష్కరిస్తామని చెప్పారు. డిసెంబరు 31న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వనపర్తి జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఫారం–18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు పోస్టు ద్వారా లేదా స్వయంగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో గడువులోగా సమర్పించాలని సూచించారు.

# జర్నలిస్టుల డిమాండ్లపై.. గళమెత్తాలి

- 'డిమాండ్ల దినోత్సవం' అక్టోబర్ 2ను విజయవంతం చేయండి
- హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, భద్రతా చట్టం కల్పించాలి
- టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా అధ్యక్షుడు మాధవరావు

వనపర్తి, సెప్టెంబరు 29 (ప్రజాజ్యోతి):" జర్నలిస్టుల హక్కులు, భద్రత, సామాజిక, ఆర్థిక సంక్షేమం కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 'డిమాండ్ల దినోత్సవం' నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే–ఐజేయూ వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి.మాధవరావు తెలిపారు. మంగళవారం జిల్లా కార్యదర్శి బి.రాజు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సముదాయ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో గాంధీ విగ్రహాల వద్ద జర్నలిస్టులు నిరసనలు చేపట్టి.. అనంతరం కలెక్టర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మీడియా రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక జాతీయ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గతంలో కల్పించిన ఉద్యోగ భద్రత, సేవా నిబంధనలు, వేతనాలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన హక్కులను పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులు, జర్నలిస్టేతర మీడియా సిబ్బందికి జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు కల్పించేందుకు కొత్త వేజ్‌బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందించి నగదు రహిత వైద్యసేవలు కల్పించాలని కోరారు. వనపర్తి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సదుపాయాలు కల్పించడంతో పాటు అక్రిడిటేషన్, గుర్తింపు కార్డులు, విధి నిర్వహణకు అవసరమైన సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మాధవరావు కోరారు.



అక్టోబర్ 2న జరిగే నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్‌ల ప్రతినిధులు, పౌరసమాజ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.రాజు, ఉపాధ్యక్షుడు కమల్ రెహమాన్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నరసింహరాజు, పట్టణ అధ్యక్షుడు తైలం అరుణ్‌రాజ్, యూనియన్ సభ్యులు ముంత రవి, జియా, ముక్తార్, పీఆర్‌టీవీ చంద్రమౌళి, నరేష్, నజీర్, చాంద్‌పాషా, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహం ధ్వంసం చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 29: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయించిన మున్సిపల్ చైర్మన్ జయరాముడు,విగ్రహ దాత నారాయణరెడ్డి, నిర్వాహకులు వెంకటరామయ్య సెట్టి, అక్కడి నుండి తొలగించి మున్సిపల్ కార్మికుల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించి ఆనవాలు లేకుండా తల చేతులు కాళ్లు బాడీ ధ్వంసం చేయించారని అన్నారు. మున్సిపాలిటీ నుండి కొత్త విగ్రహం ఏర్పాటు చేయడానికి పాలకవర్గం నుండి ఎలాంటి అనుమతి తీసుకోకుండా దౌర్జన్యంగా విగ్రహ ఏర్పాట్లు చేస్తున్నారని దీంతో గ్రామంలో వివాదాస్పదం అయి శాంతి భద్రతల సమస్య కు దారి తీసే అవకాశం ఉందని స్థానిక జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరారు మున్సిపల్ చైర్మన్ జయరాముడు విగ్రహ దాత అయిన నారాయణరెడ్డి నిర్వాహకులు






జాఫర్ లను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ సిపిఎం సిపిఐ జిల్లా నాయకులు రాజు పెదబాబు డిమాండ్ చేశారు.గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ సిపిఎం,సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలోని సిబ్బంది సుజాతకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆలయాలకు వెళ్లే దారిలో గాంధీ విగ్రహం అడ్డుగా ఉందని తీసి మున్సిపాలిటీ చెత్త సేకరించే ట్రాక్టర్ లో అవమానకరమైన రీతిలో గాంధీ విగ్రహం తరలించడం సభ్య సమాజంతల దించుకుని పరిస్థితి కల్పించారని తుంగభద్ర నది ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డ్ లో గాంధీ విగ్రహం ధ్వంసం చేసి పడేశారని స్వతంత్రసమరయోధుడు మహాత్మా గాంధీ విగ్రహం తరలింపు పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన మున్సిపల్ చైర్మన్ జయరాముడును పదవి నుండి తొలగించాలని విగ్రహ దాతగా ఉన్న నారాయణరెడ్డి అతని విగ్రహం డివైడర్ లో ఏర్పాటు చేయడం కోసం పాత గాంధీ విగ్రహం నిర్వాహకులు వెంకటరామయ్య సెట్టి జాఫర్ మెట్లు రోడ్డు మీదకు పెట్టి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీ తీర్మానం లేకుండా తెలంగాణ మున్సిపాలిటీ చట్టాలకు విరుద్ధంగా విగ్రహం ఏర్పాటు చేశారని అన్నారు. సుప్రీంకోర్టు హైకోర్టు గైడెన్స్ ప్రకారం డివైడర్ ఫుట్ పాత్ రోడ్లు జంక్షన్లు కూడలిలో విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని విధివిధానాలు ఖరారు చేసిన అవేవీ పట్టించుకోకుండా విగ్రవిష్కరణకు ఏర్పాటు చేయడం సరికాదని జిల్లాలో విగ్రహాల కమిటీ చైర్మన్ అయినా జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. గత 70 ఏళ్లుగా ప్రజల ఆస్తిగా ఉన్న లంక వెంకట రామయ్య ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహాన్ని యధావిధిగా ఏర్పాటు చేయాలని కోరారు. పేరు ప్రఖ్యాతల కోసం రాజకీయ లబ్ధి కోసం ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చూసి చూడనట్లు వ్యవహరించడం బాధ్యత రహితమని అన్నారు. పార్టీలకు అతీతంగా ఏర్పాటుచేసిన విగ్రహం స్థానంలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు వెంకటరామయ్య సెట్టి జాఫర్ పై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం జరిగిందని కేసు పెట్టి 24 గంటలు గడుస్తున్న వారిపై కేసు నమోదు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే వారిపై పిడి యాక్ట్ ఊపా చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్న వీరిపై చర్యలు తీసుకొని విగ్రవిష్కరణ కు చేస్తున్న ఏర్పాట్లను ఆపాలని కోరారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పార్టీలకు సంఘాలకు అతీతంగా ఖండించాలని కోరారు. అక్టోబర్ 2న విగ్రవిష్కరణ జరగకుండా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రజిని బాబు,సురేష్ ,కామేశ్వర్ రెడ్డి,శేఖర్,ధర్మరాజు, ఆనంద్,చిన్నముక్తార్, బుచ్చన్న,సిపిఎం నాయకులు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, దోపిడీపై అవగాహన

- వృద్ధుల సంక్షేమం కోసం చట్టాలపై అవగాహన..

వైద్య, కంటి, దంత వైద్య శిబిరాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ): అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు–2026లో భాగంగా మహబూబ్‌నగర్‌లోని "ప్రణాం" వృద్ధుల సంరక్షణ కేంద్రంలో వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, దోపిడీ, వారి హక్కులు, రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఇందిర, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వృద్ధుల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, నిర్లక్ష్యం లేదా దోపిడీకి గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు : కార్యక్రమంలో భాగంగా వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్యం, భద్రత, గౌరవప్రదమైన జీవనం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సేవల కార్యక్రమ అధికారి డా. సునీత, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి శైలశ్రీ, వైద్యాధికారి డా. నరేష్ చంద్ర, కంటి, దంత, వైద్య సిబ్బంది, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.




## ఆన్లైన్ పేమెంట్లను బహిష్కరించండి డాక్టర్.ప్రేమ్ కుమార్



గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 29: ఫోన్ పే,గూగుల్ పే,పే. టి.యం వంటి ఆన్లైన్ పేమెంట్ లను బహిష్కరించాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. సర్వీస్ చార్జిల పేరుతో పేద,మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవిదంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఉందని అన్నారు. సర్వీస్ చార్జీల పేరుతో పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని. తక్షణమే ఈ నిర్ణయం వెనక్కు తీసుకోవాలని ఆయన అన్నారు. అక్టోబర్ నుండి విధించే సర్వీస్ చార్జీలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత దేశ ప్రజలందరూ ఆన్లైన్ పేమెంట్లను బహిష్కరించాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ప్రకటనలో తెలిపారు.

## పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

- వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం : లా స్టూడెంట్స్ ఫోరం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ): పాలమూరు యూనివర్సిటీలో చదువుతున్న లా, ఇంజనీరింగ్ విద్యార్థులకు తక్షణమే హాస్టల్ వసతి కల్పించాలని లా స్టూడెంట్స్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (వీసీ) జి.ఎన్. శ్రీనివాస్‌కు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో సీటు సాధించి ఉన్నత విద్య అభ్యసించాలనే ఆశయంతో అడుగుపెట్టిన తమకు హాస్టల్ వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే ఆర్థిక స్థోమత



లేకపోవడంతో ప్రతిరోజూ సుమారు వంద కిలోమీటర్ల దూరం నుంచి రాకపోకలు సాగిస్తూ చదువుకోవాల్సి వస్తోందని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. తమలో అధిక శాతం మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులేనని, చదువుకు ఆటంకం కలగకుండా తక్షణమే హాస్టల్ వసతి కల్పించాలని కోరారు.

నిర్లక్ష్యపు అధికారుల నీడలో విద్యార్థుల భవిష్యత్తు.!

హాస్టల్ వసతి కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారుల నుంచి సరైన స్పందన రావడం లేదని లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయిన తర్వాతే వసతి కల్పిస్తామని, అప్పటివరకు ప్రత్యామ్నాయం లేదని వీసీ సమాధానమిచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. యూనివర్సిటీలో ప్రత్యామ్నాయ వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 12 గదులను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, పక్కనే ఖాళీగా ఉన్న మరో భవనాన్ని కూడా విద్యార్థుల వసతి కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష విద్యార్థుల సమస్యల పట్ల వీసీ తన వైఖరిని మార్చుకుని వారం రోజుల్లోగా హాస్టల్ వసతి సమస్యను పరిష్కరించాలని లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా న్యాయం జరగకపోతే యావత్ విద్యార్థి లోకం తరఫున ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి సుదీప్ రెడ్డి, వెంకటేష్, విద్యార్థి జేఏసీ నాయకుడు సాయి, స్వేరోస్ అధ్యక్షుడు పవన్, శివ, ప్రశాంత్, రాణి, మణికంఠ, దీక్షిత్‌తో పాటు లా, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## జూ పార్క్ సందర్శనతో దివ్యాంగ విద్యార్థుల్లో ఆనందోత్సాహం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ): దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పరిశీలనా శక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఆహ్లాదకరమైన అభ్యసన అనుభవాలను అందించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమ్మిళిత విద్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక విద్యా విహారాన్ని నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా 120 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 30 మంది తల్లిదండ్రులు, 50 మంది ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు హైదరాబాద్‌లోని జూ పార్కును సందర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఈ వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. మహబూబ్‌నగర్ సమన్వయ అధికారి సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ పర్యటన సాగింది.

జంతువులను చూసి విద్యార్థుల కేరింతలు:

జూ పార్కులో వివిధ రకాల జంతువులు, పక్షులు, ప్రకృతి అందాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు.




పుస్తకాల్లో, చిత్రాల్లో చూసిన జంతువులను కళ్లారా చూడటంతో వారిలో ఆసక్తి, ఉత్సుకత పెరిగాయి. జంతువుల జీవన విధానం, ఆవాసాలు, ఆహారపు అలవాట్ల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించింది. అనంతరం విద్యార్థులు భోజనం చేసి, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, పాలమాకుల సమీపంలోని సమతామూర్తి విగ్రహాన్ని సందర్శించారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం.. కొత్త విషయాలపై ఆసక్తి:

ఈ విద్యా విహారం కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, ఆత్మవిశ్వాసం, పరస్పర సహకారం, సామాజిక నైపుణ్యాలు, ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించే విద్యా అనుభవంగా నిలిచింది. పర్యటనలో తల్లిదండ్రులు, ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి భద్రతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్నేహితులతో కలిసి జంతువులను వీక్షిస్తూ, చిత్రాలు దిగుతూ, కొత్త విషయాలను తెలుసుకుంటూ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు.

సమాన అవకాశాలే లక్ష్యం:

ప్రతి ప్రత్యేక అవసరాల విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడం, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, ఆనందదాయకమైన అభ్యసన అనుభవాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విద్యా విహారంలో 120 మంది విద్యార్థులు, 30 మంది తల్లిదండ్రులు, 50 మంది ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బీజేపీ కిసాన్ మోర్చా సంగెం మండల అధ్యక్షుడిగా పండుగ రాజు



**సంగెం, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** బీజేపీ కిసాన్ మోర్చా సంగెం మండల అధ్యక్షుడిగా మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పండుగ రాజు(ముదిరాజు) నియమితులయ్యారు. తన ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు పరకాల నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు, సంగెం మండల అధ్యక్షుడు చంద్రమౌళి, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా పండుగ రాజు మాట్లాడుతూ.. మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి, బీజేపీ కిసాన్ మోర్చా బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు చేరువ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

## బీజేవైఎం సంగెం మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా మెంత్తుల రాజేందర్



**సంగెం, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) సంగెం మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా తిమ్మాపురం గ్రామానికి చెందిన మెంత్తుల రాజేందర్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు, మండల అధ్యక్షుడు చంద్రమౌళి, బీజేవైఎం నాయకులు మరియు కార్యకర్తలకు ఈ సందర్భంగా రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రమిస్తానని, మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు

## పరకాల నియోజకవర్గ టియుఎఫ్ ఇంచార్జీగా పెండ్లి మహిపాల్ రెడ్డి



**సంగెం, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టియుఎఫ్) పరకాల నియోజకవర్గ ఇంచార్జీగా సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన పెండ్లి మహిపాల్ రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఆయన తెరాస పార్టీ సంగెం మండల అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం సేవలందించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ నందగిరి రజినీకాంత్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఉద్యమకారుల సంక్షేమం కోసం, నియోజకవర్గంలో సంస్థాగత బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## దేవరుప్పుల గ్రామ అధ్యక్షుడిగా తోటకూరి రమేష్ నియామకం



**దేవరుప్పుల, సెప్టెంబరు 29 (ప్రజాజ్యోతి):** గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచించారు. దేవరుప్పుల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోటకూరి రమేష్ ను నియమిస్తూ మంగళవారం ఎమ్మెల్యే ఉత్తర్వులు జారీ చేశారు. నూతన అధ్యక్షుడిగా నియమితులైన రమేష్ కు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అభినందనలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ నియామకంపై మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ రమేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు ఉన్నారు.

## పూర్వ డీపీఆర్వో అయూబ్ ఖాన్‌పై విచారణకు ఆదేశం..

**డీఆర్వో శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చేసిన ఫిర్యాదుపై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) శ్రీనివాస్‌ను నియమించారు. హనుమకొండలో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిగా పనిచేసి ప్రస్తుతం వరంగల్ నగరపాలక సంస్థలో ప్రజా సంబంధాల అధికారిగా పనిచేస్తున్న అయూబ్ ఖాన్‌పై జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 2026--2028 సంవత్సరాలకు జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని వారు ఫిర్యాదులో ఆరోపించారు. పది మందితో కూడిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ రెండు దఫాలుగా సమావేశమై జర్నలిస్టుల దరఖాస్తులను పరిశీలించిందని సభ్యులు తెలిపారు. అర్హత ఉన్న జర్నలిస్టులను గుర్తించి, అర్హత లేని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతూ కమిటీ తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు. అయితే కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకోకుండా, తమకు తెలియకుండా కొన్ని అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేశారని వారు ఆరోపించారు. రాజకీయ పార్టీల నాయకుల వద్ద పనిచేసే వ్యక్తులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవారు జర్నలిస్టుల కుటుంబ సభ్యులు తదితరులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు కమిటీ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై తుది నిర్ధారణ విచారణ అనంతరం జరగాల్సి ఉంది. అదేవిధంగా డీపీఆర్వో అయూబ్ ఖాన్ సమక్షంలో జరిగిన రెండు అక్రిడిటేషన్ కమిటీ సమావేశాలకు సంబంధించిన జాబితాలను కమిటీ సభ్యులకు అందించలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విచారణకు ఆదేశిస్తూ డీఆర్వో శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించారు. గత జాబితాలో ఉన్న అనర్హులను తొలగించి, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు గాడిపల్లి మధు, బీఆర్ లెనిన్, గడ్డం కేశవమూర్తి, మస్కపురి సుధాకర్, కంకణాల సంతోష్, బొల్ల అమర్, గోకారపు శ్యాం, వల్లాల జగన్, ఎన్. బుచ్చిరెడ్డి, నయీమ్ ఉన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది..

- అందరి ఆమోదంతో అనువైన స్థలాన్నే కేటాయిస్తున్నాం..
- షాదీఖానా స్థల కేటాయింపు పత్రం అందజేసిన ఎమ్మెల్యే నాయిని





**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముస్లిం మైనార్టీల కోసం షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన 0.25 గుంటల స్థలానికి సంబంధించిన కేటాయింపు పత్రాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మత పెద్దలకు అందజేశారు. మైనార్టీ మత పెద్దలు, స్థానిక పెద్దలతో కలిసి కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ, ఆ స్థల పరిస్థితులు, భవిష్యత్‌లో నిర్మాణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు పరిశీలించారని తెలిపారు. గతంలో భద్రకాళి అమ్మవారి మట్టి తీసుకువచ్చి ఆ ప్రాంతాన్ని పూడ్చడం జరిగిందని, దీంతో అక్కడ నిర్మాణం చేపడితే భవనం పునాదులు కుంగిపోయే అవకాశం ఉందని అధికారులు సాంకేతికంగా గుర్తించినట్లు వివరించారు. మైనార్టీలకు మెరుగైన వసతులతో షాదీఖానా నిర్మించాలన్న ఉద్దేశంతోనే పాత స్థలానికి ప్రత్యామ్నాయంగా మరింత అనువైన స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. అయితే కొందరు రాజకీయ విమర్శలు చేస్తూ గతంలో కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించకుండా రాజకీయ లబ్ధి కోసం మైనార్టీలను తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే మత పెద్దలు, స్థానిక పెద్దలతో కలిసి స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని చెప్పారు. రహదారి సౌకర్యం, స్థల పరిస్థితులు, భవిష్యత్ నిర్మాణానికి అనుకూలత తదితర అంశాలను వారికి వివరించినట్లు తెలిపారు. అందరి ఆమోదంతో, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసుకునే అవకాశం మత పెద్దలకు కల్పించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మైనార్టీల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. షాదీఖానా నిర్మాణం పూర్తయితే ముస్లిం మైనార్టీ కుటుంబాలకు వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలను అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ అజిత్ ఉల్లా, మాజీ కార్పొరేటర్లు అబూబకర్, నసీం జాన్, విజయశ్రీ రాజాలీ, నాయకులు అంకుస్, బాబాయ్, ముజాహిద్, సమీతో పాటు మైనార్టీ మత పెద్దలు, స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో వసతులు మెరుగ్గా ఉండాలి



- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి..
- విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై దృష్టి పెట్టాలి..
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** హాస్టల్‌లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగదిని పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులకు తయారు చేస్తున్న వంట పదార్థాలు, నిత్యావసర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ అందించే భోజన మెనూ చార్ట్‌ను తనిఖీ చేశారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఆ రోజు అందించిన అల్పాహారం, స్నాక్స్, గుడ్లు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను కలెక్టర్ అడిగారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై సమానంగా దృష్టి సారించి చదువుకోవాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈ దశలో నేర్చుకున్న విషయాలు భవిష్యత్ జీవితానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయకపోవడంతో పాటు తరగతి గదిలో పనిచేయని ఫ్యాన్‌ను మరమ్మతు చేయించకపోవడంపై హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ దీపపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులు వెంటనే కల్పించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల టాయిలెట్లు, డార్మిటరీలను పరిశీలించారు. హాస్టల్ పరిసరాలు, తరగతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం, స్నాక్స్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం సమయానుకూలంగా అందించాలని ఆదేశించారు. భోజనం తయారీలో నాణ్యమైన నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదులు పరిశుభ్రంగా, విద్యార్థులకు అనుకూలంగా ఉండాలని, అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని స్పెషల్ ఆఫీసర్‌ను కలెక్టర్ హెచ్చరించారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు..
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి..







**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సామాజిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కలెక్టర్ తెలిపారు. సరదా, స్నేహితుల ప్రభావం, ఆసక్తి వంటి కారణాలతో కొంతమంది యువత మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులవుతున్నారని, ఒకటి రెండు సార్లు తీసుకుంటే ఏమీ కాదనే నిర్లక్ష్య ధోరణి క్రమంగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సామాజిక జీవనంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల కారణంగా భవిష్యత్తు అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. యువత తమ విలువైన జీవితాన్ని మత్తు పదార్థాలకు బలి చేయకుండా విద్య, క్రీడలు, సృజనాత్మకత, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సమష్టిగా పనిచేసినప్పుడే సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోగలమని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.

**విద్యార్థి దశలోనే అవగాహన అవసరం :** కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే వ్యక్తి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా నష్టపోతారని తెలిపారు. తమ స్నేహితుల్లో ఎవరైనా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నట్లు గుర్తిస్తే వారిని చైతన్యపరిచి సరైన మార్గంలోకి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

**మత్తు పదార్థాల నిర్మూలనలో యువత పాత్ర కీలకం :** కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సంచాలకులు ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావన, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని, తమతో పాటు సమాజంలోని ఇతరులను కూడా చైతన్యపరచాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు జీవిత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు, విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని కోరారు. నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కుమార్ స్వామి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే చట్టపరమైన, ఆరోగ్యపర మైన, సామాజిక పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు బాధ్యతాయుతంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ చందర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## చల్లా పరామర్శలు



**పరకాల సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** బైక్ ప్రమాదంలో గాయపడి కాలు సర్జరీ అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పరకాల నియోజకవర్గం నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొమ్మన బోయిన రవీందర్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డి పరామర్శించారు. ప్రమాదం వివరాలను తెలుసుకున్న ఆయన రవీందర్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్జరీ అనంతరం ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందో కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రవీందర్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవనానికి తిరిగి రావాలని చల్లా ధర్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రవీందర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చాకిరేవు గుట్ట మైనింగ్ రద్దుపై అధికారుల పరిశీలన..



**పరకాల సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** కంఠాత్మకూరు చాకిరేవు గుట్ట వద్ద మైనింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు గుట్ట వద్ద పరిశీలన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఇరిగేషన్ శాఖ డీఈ రవి, జేఈ జమీల్ మన మాట గుట్ట వద్దకు చేరుకుని మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. గుట్ట పరిస్థితి, అక్కడి పరిసరాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. మైనింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో అధికారుల పరిశీలనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంగంటి తిరుపతి, ఉప సర్పంచ్ కుమారస్వామి, జేపీసీ జనరల్ సెక్రటరీ కుమ్మరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ పక్వాడ్



**మహాముత్తారం, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** పిల్లల ఆరోగ్య రక్షణ, పౌష్టికాహార ప్రాముఖ్యతపై పెగడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయపల్లి అంగన్‌వాడీ టీచర్ బానోతు విజయ మాట్లాడుతూ.. చిన్న పిల్లల్లో లోపపోషణను నివారించడానికి, వారి శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. పెగడపల్లి అంగన్‌వాడీ టీచర్ జాటోత్ రజిత మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన ముందస్తు విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న ఉచిత సేవలు, పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఆరోగ్యానికి తల్లిదండ్రులు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా చనపురి సారక్క, స్థానిక గర్భిణులు, బాలింతలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్మెట్టలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**నర్మెట్ట, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** నర్మెట్ట మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నర్మెట్ట గ్రామ సర్పంచ్, జనగామ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, ఆగపేట సర్పంచ్ రాజు, మల్కాపేట సర్పంచ్ మహేందర్, వెల్దండ సర్పంచ్ అంజనేయులు, మచ్చుపహాడ్ హనుమంతపురం సర్పంచులు, తహసిల్దార్ కలకుంట్ల వెంకట రామానుజ చారి, ఎంపీడీఓ సుమన్, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం





**పెద్దవూర సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి) :** మండలంలోని,చలకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని,విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించిన సందర్భంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్నని శాలువాతో ఘనంగా సత్కరించిన ఉపాధ్యాయులు మరియు సర్పంచ్ సల్లా అంజిరెడ్డి, మాట్లాడుతూ పర్వేదుల నుంచి చలకుర్తి గ్రామానికి ప్రతి రోజూ వచ్చి చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, చలకుర్తి గ్రామస్తుల తరపున మరియు మా తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని తెలియజేశారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో విద్యాశాఖ చైర్మన్ జానపాటి కళమ్మ,తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ యంపిపి యడవెల్లి దిలీప్ రెడ్డి,వార్డు మెంబర్ మస్తాన్,శ్రీరాంపల్లి ఉప సర్పంచ్ గజ్జల శివారెడ్డి,బాలకృష్ణ రెడ్డి, మాజీ సొసైటీ కోపరేటివ్ నాగెండ్ల కృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ కొట్టె బాలయ్య యాదవ్,అయితబోయిన పెద్ద సైదయ్య గౌడ్,చిన్న సైదయ్య గౌడ్, శంకర్ గౌడ్,తరుణ్ రెడ్డి,జెజాల నాగరాజు,అభినవ్ యాదవ్,వైడిఆర్ బిపిఆర్ అధ్యక్షులు గడ్డం సజ్జన్ మరియు చలకుర్తి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కొండమల్లేపల్లి విద్యార్థుల ప్రతిభ



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 29, (ప్రజాజ్యోతి) :** నల్గొండలో ఈనెల 27వ తేదీ ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కొండమల్లేపల్లి కరాటే విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పోటీపడి విజయం సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా విజేతలను ఎంఆర్ఓ మన్నె నరేందర్, సర్పంచ్ యుగంధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కరాటే మాస్టర్ కొండ్రపల్లి సురేష్, పంచాయతీ సెక్రటరీ, టీపీఎస్ఎఫ్ డీవీకే డివిజన్ అధ్యక్షుడు ఆర్. జైహిందర్, ఎస్. అజయ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

## ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**నల్లగొండ సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :**



శాలిగౌరారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో అగ్రికల్చర్ ఆఫీసర్ సౌమ్యశృతి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, పురుగు మందుల నిల్వలు, లైసెన్సులు, కొనుగోలు--విక్రయ రికార్డులు, బ్యాచ్ నంబర్లు, గడువు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు.

గడువు ముగిసిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని డీలర్లను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే మందులను విక్రయించాలని సూచించారు. నకిలీ లేదా గడువు ముగిసిన ఎరువులు, పురుగు మందులను విక్రయించిన డీలర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు నాణ్యమైన మందులు మాత్రమే అందించాలని సూచించారు. కల్తీ ఎరువులు లేదా కల్తీ ఎన్‌పీకే మిశ్రమాలను విక్రయించినట్లు తేలితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తప్పవని అగ్రికల్చర్ ఆఫీసర్ సౌమ్యశృతి స్పష్టం చేశారు.

## సుంకరి కేశయ్య సేవలు చిరస్మరణీయం



**నల్లగొండ సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకరి కేశయ్య ఇటీవల మృతి చెందగా, వల్లభాపురంలోని స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన దశదినకర్మ, సంతాప సభకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సంతాప సభలో దైద రవీందర్ మాట్లాడుతూ.. బొప్పారం గ్రామ ప్రజల హృదయాల్లో సుంకరి కేశయ్య చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోల్ల వెంకట్‌రెడ్డి, బొప్పారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శివయ్య, కాంగ్రెస్ నాయకుడు సోమయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు సంజీవరెడ్డి, ఇసాక్, చౌడయ్య, వెంకన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల గుర్తింపు



**గరిడేపల్లి, సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి) :** గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా కళాశాల బిఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు కీతవారిగూడెంలో భాగస్వామ్య గ్రామీణ విశ్లేషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు, గ్రామస్థులతో చర్చించి గ్రామంలోని సమస్యలు,అవసరాలు, వనరులు,వ్యవసాయ పరిస్థితులను గుర్తించారు. సామాజిక, వనరుల పటాలను రూపొందించి సాగుభూములు, నీటి వనరులు,పంటలు, పశు సంపద తదితర వివరాలను నమోదు చేశారు. పంటల సాగు కాలాలు, వర్షపాతం, నీటి లభ్యత,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఏ.నరేష్, ఆదర్శ్, సర్పంచ్ బొల్లేపల్లి రామనాథం, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. విద్యార్థినులు నవ్యశ్రీ, మోనికా, మనీషా, హేమలత, సత్యజ్యోతి, సౌమ్య కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## పోషకాహారం తోనే ఆరోగ్యకరమైన సమాజం

### గానుగుబండ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాస కార్యక్రమం



**తుంగతుర్తి, సెప్టెంబర్ 29,(ప్రజా జ్యోతి) :** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని సర్పంచ్ మాతంగి వెంకటమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గానుగబండ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాస కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం, పోషక విలువలు, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రమీల, ఉప సర్పంచ్ ఎనగందుల లావణ్య, అంగన్వాడీ టీచర్లు గుండగాని శోభ,జ్యోతి, అంజలి, ఆశా కార్యకర్త రమ, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ధర్నాను విజయవంతం చేయాలి



**మల్లేపల్లి, సెప్టెంబర్ 29, (ప్రజాజ్యోతి) :** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ధర్నా, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీ యు డబ్ల్యూ జే-ఐజే యూ దేవరకొండ డివిజన్ అధ్యక్షులు గాదె గిరిధర్‌రావు పిలుపునిచ్చారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో జర్నలిస్టులు ర్యాలీలు నిర్వహించి అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని గాదె గిరిధర్‌రావు పిలుపునిచ్చారు.

## పసునూరులో ఎస్జీఎఫ్ ఖోఖో పోటీలు

- తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి పోటీలకు వందలాది మంది విద్యార్థులు
- క్రీడా స్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



**నాగారం, సెప్టెంబర్ 29, ప్రజా జ్యోతి :** మండల పరిధిలోని పసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి ఎస్జీఎఫ్ ఖోఖో టోర్నమెంట్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, తహసీల్దార్ దేవేంద్ర ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్ర హరికిషన్, పీడీ బత్తుల కళమ్మ పోటీలను ప్రారంభించారు.

**వందలాదిగా విద్యార్థుల హాజరు :** నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఖోఖో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభను ప్రదర్శిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటారు. వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు వందలాదిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ముజ్జిగ సూర్యకాంతం, నాగారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి.జ్ఞానేశ్వరాచారి, ఫణిగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేముల బాలరాజు, పసునూరు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు బింగి శ్రీనివాస్, తుంగతుర్తి ఎస్జీఎఫ్ డివిజన్ సెక్రటరీ సన్నీల్ల యాదయ్య, ఎస్జీఎఫ్ బాధ్యులు కే. యాకయ్య, కే. మహేష్, కల్పన, సైదులు, బి. రజిత, సూర్యాపేట జిల్లా బాధ్యులు అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

**దాతల సహకారం :** పోటీలకు అవసరమైన బహుమతులను పసునూరు సబ్ పోస్టుమాస్టర్ ఆకుల స్వరూప అందించారు. భోజన ఏర్పాట్లను ఆర్ఎంపీ గోపగాని వెంకన్న--శ్రీదేవి దంపతులు, టెంట్ ఏర్పాట్లను ముజ్జిగ సంపత్--సూర్యకాంతం, డీజే సౌకర్యాన్ని తుంగతుర్తికి చెందిన బండి నవీన్ అందించారు. పసునూరు పాఠశాల ఉపాధ్యాయులు కే.సైదులు, శివకుమార్, శోభారాణి, రాజు, రాములు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి

- ఉద్యోగ భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం
- టి డబ్ల్యూ యు--ఎస్ డబ్ల్యూ ఎఫ్ కూటమికి మద్దతుగా ప్రచారం
- ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి







**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి) :** ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట డిపోలో టిడబ్ల్యూయు-ఎస్ డబ్ల్యూ ఎఫ్ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో వారి సమస్యలపై చర్చించారు.మెరుగైన వేతనాలు, పదోన్నతులు, ఆరోగ్య భద్రత, కుటుంబ సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారంపై గుర్తింపు యూనియన్ బలంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వంలో విలీనం ప్రక్రియకు సంబంధించిన అంశాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**బాణం,నక్షత్రం గుర్తులకు ఓటేయాలి :** అక్టోబర్ 9న జరిగే టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో టి డబ్ల్యూ యు--ఎస్ డబ్ల్యూ ఎఫ్ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. బాణం, నక్షత్రం గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీని బలోపేతం చేయడం, కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించడం, కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## లాభాల బాటలో సింగిల్ విండో

పిఎసిఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్రెడ్డి



**ఆలేరు సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లాభాల బాటలో పిఎసిఎస్ నడుస్తుందని సింగిల్ విండో చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పెద్దపీట వేసిందంటే కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. రైతులకు వద్ద కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బంది జరగలేదన్నారు. కొనుగోలు చేసిన అనంతరం డబ్బుల విషయంలో కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి రైతు ఖాతాలో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రైతులకు పిఎసిఎస్ ఆధ్వర్యంలో రుణాలు ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వం తొందరలోనే ప్రకటిస్తాదని గుర్తు చేశారు.

రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా వ్యవసాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ రాజు ,ఒట్టిపల్లి శ్రీనివాస్, బండ వీర మల్లయ్య, బొమ్మకంటి లక్ష్మీనారాయణ, చెక్క వెంకటేష్, శ్రీను, ముత్తయ్య, స్వరూప, యాదమ్మ, బిక్షపతి, సింగిల్ విండో సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనిలో సోషల్ ఆడిట్ - అడిషనల్ డిఆర్డిఓ సురేష్





**ఆలేరు సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి :** 2025 -2026 హార్దిక సంవత్సరంలో 16వ విడత ప్రజా తనిఖీలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏపీఓ అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ ఆడిట్ సామాజిక తనికి కి వారు హాజరై మాట్లాడుతూ 2025 -2026 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 355 పనులకు గాను 3,63,95,815 రూపాయలు సామాజిక టానికి బృందం వారు సెప్టెంబర్ 17 వ తారీకు నుండి 28 వరకు తనిఖీ చేసి గ్రామసభలు నిర్వహించారన్నారు. అందులో భాగంగా ఏఈపిఆర్ 18 78, టెక్నికల్ అసిస్టెంట్లు 4000 కంప్యూటర్ ఆపరేటర్లు 921 పంచాయతీ కార్యదర్శులకు 21 29 రూపాయలు ఫీల్డ్ అసిస్టెంట్లు 31 75 రూపాయలు మొత్తం 12 103 రూపాయలు రికవరీ ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ వివో మండడి ఉపేందర్ రెడ్డి, ఏవి ఎంఆర్ ఆదిత్య వర్ధన్, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఏపీఎం అనురాధ దేవి, ఎస్ టి ఎం తిరుపతి, ఎస్ఆర్పి వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ రామచంద్రయ్య, మానస కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మి స్వరాజ్యం సరళ పలు గ్రామాల సర్పంచులు పంచాయితీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల కోరల్లో గ్రామ చెరువు

- పునరుద్ధరణ చేయాలని త్రిపురారం మండల పార్టీ బిజెపి అధ్యక్షుడు రెమడాల రమేష్



**త్రిపురారం సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలోని 30 ఎకరాల 27 గుంటల భూమిని పై విస్తీర్ణం కలిగి ఉన్నది. ఇటీవల కొంతకాలంగా కొంతమంది భూకబ్జాదారులు చెరువు ఎఫ్ టి ఎల్( ఫుల్ ట్యాంక్ లెవెల్) పరిధిలోని శిఖం భూముల్లోకి చొచ్చుక వచ్చి అక్రమంగా అక్రమాలు చేస్తున్నారు ఇలా చేయడం వలన చెరువు నీటి నిలువ సామర్థ్యం పూర్తిగా తగ్గి పోయింది భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కావున ఇట్టి విషయాన్ని రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖ వెంటనే స్పందించి చెరువు హద్దులను నిర్ధారించవలసిందిగా అక్రమణాలను తొలగించి పూర్వ వైభవము తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా చెరువు అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయవలసినదిగా బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రెమడాల రమేష్ గారు ప్రధాన కార్యదర్శి మహేష్ గారు సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి గారు కటికం మల్లికార్జున్ గారు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈ సతీష్ కుమార్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ యువ నాయకులు పాల్గొన్నారు.

## పర్యాటక దినోత్సవ పోటీలలో డిస్ట్రిక్ట్ సెకండ్ బహుమతి సాధించిన క్రిష్ణవేణి విద్యార్థులు



**రామన్నపేట సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) :** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ డిస్ట్రిక్ సెకండ్ ప్రైజ్ సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎస్.శరణ్ తేజ్, లవణం విశ్వ సాయి, ఎస్ శ్రీకారుణ్య, తస్లీం ఖానం, ఈ. శ్రీవిద్య తదితరులు జిల్లా పర్యావరణ మరియు టూరిజం శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ మురళి ని కరెస్పాండెంట్ తో పాటు ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె వి ఎన్ ఎస్ మణి అభినందించారు.

## గురువే.. భావి భారతానికి దిక్సూచి!

- విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది
- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**తుంగతుర్తి, సెప్టెంబర్ 29,(ప్రజా జ్యోతి) :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, తహశీల్దార్ దయానందం, ఎంపీడీవో చలపతి, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ లింగయ్యతో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తరగతి గదిలో పాఠాలు చెప్పే గురువు.. సమాజానికి భవిష్యత్ తరాలను అందించే శిల్పి అని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సేవలకు సమాజం ఎప్పటికీ రుణపడి ఉంటుందని, ఉత్తమ ఉపాధ్యాయులు మరింత స్ఫూర్తితో పనిచేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

• సొసైటీ చైర్మన్ న్యాల కంటి అబ్బన్న



నవీపేట్: (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం 64వ మహాజన సభ సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ క్రమంలో సంఘ సభ్యుల సమక్షంలో యాప్ రహిత యూరియా అందించాలని అర్హత కలిగిన రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని రవాణా చార్జీలు ప్రభుత్వమే భరించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘాలు రైతుల సంక్షేమం కోసం పాటు పడతాయని వారు అన్నారు. కావున రైతులు సహకార సంఘ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సొసైటీ కార్యదర్శి మహేష్ కుమార్ గౌడ్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యునిగా భాను గౌడ్ నియామకం



నవీపేట్ (ప్రజా జ్యోతి): మండల కేంద్రానికి చెందిన భాను గౌడ్ ని జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యునిగా నియ మించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తన సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో కార్యవర్గ సభ్యునిగా నియమించిన ఎంపీ ధర్మపురి అరవింద్ బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, మోహన్ రెడ్డి మరియు భరత్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మండల వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

## మండల స్థాయి సీడబ్ల్యూఎస్ఎన్ క్రీడలు ఘనంగా నిర్వహణ



ఇందల్వాయి: ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 29. ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాల, భవిత కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి సీడబ్ల్యూఎస్ఎన్ క్రీడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, గ్రామ సర్పంచ్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. విద్యార్థులకు మంచి నాణ్యత కలిగిన సాక్స్‌తో పాటు స్నాక్స్‌ను ఏర్పాటు చేసి వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలకు విశేష స్పందన

• 43 మందికి కంటి పరీక్షలు.. 31 మంది ఆపరేషన్లకు రిఫర్




బీర్కూర్, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి): బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రెగ్యులర్ ఉచిత కంటి పరీక్షలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య సహాయకులు సతీష్ ఆధ్వర్యంలో మొత్తం 43 మంది పేషెంట్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం కంటి శస్త్రచికిత్స అవసరమున్న 31 మందిని బోధన్ లయన్స్ ఆసుపత్రికి ఆపరేషన్ల కోసం రిఫర్ చేశారు. అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పలువురు గ్రామీణులు లయన్స్ క్లబ్ సేవలను అభినందించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ముఖ్యంగా వయస్సు పైబడిన వారు చూపు మందగించడం, కంటి నొప్పి, మసకబారడం వంటి సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మైత్రి కిరణ్, లయన్స్ జోన్ చైర్మన్ సితలె రమేష్, సీనియర్ లయన్ మేకల విఠల్, లయన్ సభ్యులు మేరు భరత్, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం ఉచిత వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీలే పునాది

• సేవా సంకల్ప అభియాన్‌లో ఘనంగా సన్మానం • బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజు



నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి): సమాజ నిర్మాణంలో అంగన్‌వాడీ టీచర్ల సేవలు ఎంతో కీలకమైనవని బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజు అన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన నీలం చిన్నరాజు అంగన్‌వాడీ టీచర్లను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, పోషకాహారం, బాలల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమాజంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించడమే సేవా సంకల్ప అభియాన్ ప్రధాన ఉద్దేశమని నీలం చిన్నరాజు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారికి మరింత భద్రత కల్పించేందుకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్లను సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించడంతో పాటు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలందించేలా ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు చందూరి హన్మండ్లు, లక్ష్మీనారాయణ, వడ్ల సతీష్, లక్ష్మన్, నాగరాజు, శేఖర్, మలేష్, సుబ్రహ్మణ్యస్వామి, అతుకురు సాయిలు, సురేష్, వెంకన్న, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత షెడ్ నిర్మాణానికి కర్ర పూజ



కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో దుర్గామాత ఆలయ షెడ్ నిర్మాణం కోసం మా శక్తి సేన ఆధ్వర్యంలో కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గామాత మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మా శక్తి సేన సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత షెడ్ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మా శక్తి సేన అధ్యక్షుడు లోకోటి రవి వర్మ, ఉప అధ్యక్షుడు వంగల విశ్వం, క్యాషియర్ కడారి రాజశేఖర్‌తో పాటు సభ్యులు అశోక్, బాలమల్లు, మనోజ్, కడారి మనోజ్, చి. ప్రశాంత్,చిన మహిపాల్ ,జనార్ధన్ రవి కుమార్, జశ్వంత్, శ్రీకర్, సాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దుర్గామాత వార్షికోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఆహ్వానం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(ప్రజా జ్యోతి) జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), న్యూఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి దేవేంద్ర కుమార్ నిమ్ కామారెడ్డి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పూల మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవేంద్ర కుమార్ నిమ్ ఎల్లారెడ్డి ఆర్డీఓ ప్రభాకర్‌తో కలిసి తదుపరి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గాంధారి మండలానికి బయలుదేరారు.







## బీఆర్ఎస్ పార్టీ నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు



జహీరాబాద్, సెప్టెంబర్ 29 ( ప్రజా జ్యోతి న్యూస్ ) ఇటీవల న్యాల్కల్ మండలం చల్కి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకు లను ఎమ్మెల్యే మాణిక్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు జరిగిన సంఘటన వివరాలను ఎమ్మెల్యే కు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే పోలీస్ అధికారులతో మాట్లాడి విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. కష్టకాలంలో ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, న్యాయపరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మాణిక్ రావు స్పష్ట మైన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటుగా మాజి మండల పార్టీ అధ్యక్షులు నరసింహ రెడ్డి, మాజి సర్పంచ్ లు రవి కుమార్, మారుతి, నాయకులు అశోక్, కైరత్ పటేల్, అంజి, శ్రీనివాస్ రెడ్డి, దత్తు, తదితరులు ఉన్నారు.

## రబీ సీజన్ శనగ విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు



రాయికోడ్ సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి): రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు. ఈరోజు నుంచి శనగ విత్తనాల పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌బీఈజీ--452 రకం శనగ విత్తనాలను 25 కిలోల బ్యాగ్‌కు రూ.1,500 ధరకు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. విత్తనాలు పొందేందుకు రైతులు ఆధార్ కార్డు జిరాక్స్,పట్టా పాస్‌బుక్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. రైతులకు టోకెన్ల జారీ కోసం రాయికోడ్ రైతు వేదిక వద్ద ఏఈఓ నిఖిలేష్, రాయికోడ్ చౌరస్తా వద్ద ఏఈఓ శివకుమార్ అందుబాటులో ఉంటారని తెలిపారు. మండలంలోని రైతులు అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత కేంద్రాలకు హాజరై టోకెన్లు పొందాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

## ప్లాస్టిక్ నిషేధిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం

హత్నూర సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి): హత్నూర మండలంలోని నస్తీపూర్ గ్రామ పంచాయతీలో మంగళవారం రోజున స్వచ్ఛతా హీ సేవ 2026 లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాడే ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్ గ్లాసులు, బాటిళ్లు, పాత్రలు కొనడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమీల సాయిలు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అందులో భాగంగానే మొదటగా ఆ మంచి పద్ధతి మనతోనే మొదలై ఊరంతా ఈ స్టీల్ వాడకాన్ని పెంచాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల సాయిలు,ఉపసర్పంచ్ మహేందర్, గ్రామ కార్యదర్శి యాదయ్య, వార్డు సభ్యులు కళ్యాణ్ రాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, వాలంటీర్ ప్రవళిక, యాదయ్య, స్వామి, రమేష్, ప్రవీణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# క్రీడా విజేతలకు గీతం ఘన సత్కారం

• ఇదే స్ఫూర్తితో మున్ముందూ రాణించాలి





పటాన్ చెరు (ప్రజాజ్యోతి) క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ విద్యార్థులను మంగళవారం విశ్వవిద్యాలయ నాయకత్వం ఘనంగా సత్కరించింది, భవిష్యత్తులో ను పోటీల్లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించింది. గీతం విశాఖపట్నం ప్రాంగణంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో నిర్వహించిన డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి మెమోరియల్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో హైదరాబాద్ విద్యార్థులు సత్తా చాటారు. గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలకు చెందిన సుమారు 555 మంది విద్యార్థులు వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌తో పాటు పలు సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్‌లో హైదరాబాద్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. పురుషుల జట్టు 200, 1500 మీటర్ల పరుగులు, 4x100 మీటర్ల రిలే, షాట్‌పుట్‌లో స్వర్ణ పతకాలు సాధించగా.. మొత్తం ఏడు పతకాలు దక్కించుకుంది. మహిళల జట్టు 100, 200, 1500 మీటర్ల పరుగులు, 4x100 మీటర్ల రిలేల్లో స్వర్ణాలతో పాటు వివిధ విభాగాల్లో రజత, కాంస్య పతకాలు సాధించి మొత్తం పది పతకాలు గెలుచుకుంది. టీమ్ ఈవెంట్లలో టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, మిక్స్‌డ్ డబుల్స్ పికిల్‌బాల్‌లో గీతం జట్లు రజత పతకాలు సాధించాయి. సాంస్కృతిక విభాగంలో బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, కల్చరల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతులు దక్కించుకోగా, పాశ్చాత్య, శాస్త్రీయ నృత్యాలు, స్కిట్లలో ద్వితీయ స్థానాలు సాధించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు విజేతలకు పతకాలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

## ఎంపీఓ పోస్టు ఖాళీ.. పంచాయతీ పనులకు బ్రేక్!

• కొండాపూర్ మండలంలో 24 గ్రామ పంచాయతీలకు ఇబ్బందులు..
• ఎంపీఓ, సూపరింటెండెంట్ లేక పరిపాలనలో జాప్యం..
• పంచాయతీ కార్యదర్శులపై సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు..

కొండాపూర్ ప్రజా జ్యోతి కొండాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎంపీఓ (మండల పంచాయతీ అధికారి) పోస్టును వెంటనే భర్తీ చేయాలని మండల ప్రజలు, పంచాయతీ వర్గాలు కోరుతున్నారు. మండలంలో ఎంపీఓతో పాటు సూపరింటెండెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో 24 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పరిపాలనా పనులు సక్రమంగా ముందుకు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీఓ లేకపోవడంతో గ్రామ పంచాయతీల పనితీరును పర్యవేక్షించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై కూడా పర్యవేక్షణ కొరవడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని, మరికొందరు కార్యాలయాలకు సక్రమంగా హాజరు కాకుండా ఒకటి, రెండు గంటలు మాత్రమే ఉండి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రజా సమస్యలు, ధ్రువపత్రాలు, పారిశుధ్యం, పంచాయతీ పరిపాలన తదితర పనుల్లో జాప్యం ఏర్పడుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శుల హాజరు, సమయపాలనపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 24 గ్రామ పంచాయతీల పరిపాలన సజావుగా సాగేందుకు కొండాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎంపీఓ, సూపరింటెండెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సైదాపూర్ పాఠశాల నుంచి ఉపాధ్యాయుల బదిలీలు నిలిపివేయాలి

• వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో టీచర్లను తొలగించొద్దు: సర్పంచ్ రాధిక రామగౌడ్




కొండాపూర్ ప్రజా జ్యోతి సైదాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం సరికాదని సైదాపూర్ సర్పంచ్ రాధిక రామగౌడ్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు బోధనకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఉపాధ్యాయులను అదే పాఠశాలలో కొనసాగించాలని ఆమె కోరారు. మంగళవారం సంగారెడ్డిలో జిల్లా విద్యాశాఖాధికారి రోహిణిని కలిసి సర్పంచ్ రాధిక రామగౌడ్ వినతిపత్రం అందజేశారు. సైదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో తొలగించకుండా, వారిని అదే పాఠశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో తెలుగు పండిట్‌గా బోధిస్తున్న ఉపాధ్యాయుడిని వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఇతర పాఠశాలకు బదిలీ చేశారని తెలిపారు. తాజాగా హిందీ పండిట్‌ను కూడా బదిలీ చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని, వాటిని తక్షణమే నిలిపివేయాలని కోరారు. సైదాపూర్ గ్రామం వెనుకబడిన ప్రాంతంలో ఉండటంతో విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో అవసరమైన ఉపాధ్యాయులను కొనసాగించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

# నాడు కారు.. నేడు కమలం జోరు

- రాష్ట్ర నాయకుడి గ్రామంలో గులాబీకి షాక్
- ఎంపీ ఫోకస్‌తో మారుతున్న సమీకరణాలు
- సురగొని గెలుపుతో మారుతున్న తీరు
- భారీ చేరికలతో బీజేపీలో నయా జోష్
- భాజపాలో చేరిన వ్యాపారి సురగోని శ్రీనివాస్



**చిన్నకోడూరు, సెప్టెంబరు29, (ప్రజాజ్యోతి):-** నాడు గులాబీ జెండా రెపరెపలాడిన గడ్డపై ఇప్పుడు కాషాయ జెండా ఎగురుతుంది. రాజకీయంగా ఏండ్ల నుండి గులాబీ పార్టీ కి పట్టున్న గ్రామంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నిన్నటి వరకు గులాబీ పార్టీకి కంచుకోటగా పేరున్న చంద్లాపూర్‌లో నేడు సర్పంచ్ సురగోని శేఖర్ గౌడ్ నాయకత్వంలో సరికొత్త రాజకీయానికి తెరలేపిందనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. నిన్నటి వరకు గులాబీ జెండాతో కళకళలాడిన గ్రామంలో ఇప్పుడు కాషాయ జెండా రెపరెపలాడుతుండటం చర్చనీయాంశంగా మారింది. మొన్నటికి మొన్న భారీగా జరిగిన పార్టీ చేరికలతో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని చెప్పవచ్చు. గ్రామంలో మొన్నటికి మొన్న జరిగిన భారీ చేరికల్లో భాగంగా గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి సురగొని శ్రీనివాస్ తో కలిసి దాదాపు వంద మంది బీజేపీ పార్టీలో చేరటం కాషాయ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఒక వైపు తమకు అన్యాయం జరిగిందంటూ గ్రామస్తులు గళం విప్పుతుండటంతో రాజకీయమంతా ఒకేసారి హీటెక్కింది. మండలంలో చంద్లాపూర్ గ్రామానికి రాజకీయపరంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉండటంతో పాటు గులాబీ పార్టీకి బలమైన పట్టున్న గ్రామంగా పేరొందింది. రోజు రోజుకు మారుతున్న రాజకీయాలు, స్థానికంగా అంతర్గతంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆగ్రామ రాజకీయాన్ని మార్చుతున్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. నాడు గులాబీ జెండా నీడన తిరిగిన రాజకీయాలను కాదంటూ నేడు భాజపా జెండా మోసేందుకు సిద్ధమవటంతో రాజకీయ పరంగా కొత్త ఆలోచనలను పుట్టిస్తుంది. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆయన ఎన్నికల ప్రచారాన్ని చంద్లాపూర్ నుంచే ప్రారంభించడం లోకల్ గా బిజెపి పటిష్టతకు ఆజ్యం పోసిందని చెప్పవచ్చు. పోటీ చేసిన ఎంపీ ఎన్నికలలో రఘునందన్ రావు విజయం సాధించటంతో పాటు ప్రస్తుతం గ్రామంలో బీజేపీకి అనుకూలంగా చోటుచేసుకుంటున్న ఆయా పరిణామాలు కాషాయదళానికి మరింత ఊతమిస్తున్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్ స్వగ్రామం కావడంతో చంద్లాపూర్‌కు నాటి నుండి రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అలాంటి గ్రామంలో రోజురోజుకు రాజకీయ సమీకరణాలు మారుతూ వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తర్వాత తనకంటూ పెట్టని కోటలా చంద్లాపూర్ ను నిర్మించుకున్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు తన బలాన్ని కోల్పోతుందనే నిజాన్ని చెప్పక తప్పదు. ఒక్కసారిగా రాజకీయ పరిస్థితులు మారడం వెనుక గ్రామస్తులలో ఉన్న అసంతృప్తి కారణమని తెలుస్తుంది. తమకు అన్యాయం జరిగిందని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న తమ బాధను పట్టించుకున్న నాయకుడే లేడంటూ బిజెపి పార్టీలో చేరిన పలువురు స్పష్టం చేశారు. పలు అంశాలపై తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గ్రామంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఖచ్చితంగా బయటకు తీసుకు వస్తామంటున్నారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టు నిర్మాణం మొదలుకొని గ్రామంలో ఏర్పడిన పరిణామాలపై విచారణ జరిపేందుకు అవసరమైన ఆధారాలను కొద్ది రోజుల్లో తేటతెల్లం చేస్తామంటూ గ్రామానికి చెందిన పలువురు చెప్తున్నారు. అయితేరానున్న రోజుల్లో పార్టీ బలం, ప్రజల మద్దతు, స్థానిక సమస్యలపై నాయకుల స్పందన కమలంపై పెరుగుతున్న ఆదరనో తెల్వదు కానీ కాషాయ పార్టీ హవా ఇలానే కొనసాగితే గులాబీ పార్టీ కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదు.

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్ డిమాండ్



**కొమురవెల్లి సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి):-** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రసూలాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్ అన్నారు. నిన్న కిష్టంపేట గ్రామ పరిధిలోని ఎంబెరు మన్నార్ స్వామి దేవాలయ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎలాంటి ప్రోటోకాల్ లేని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొని, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఉద్దేశించి దొంగ ఓట్లతో గెలిచారంటూ విమర్శించడం సరికాదని ఆయన మండిపడ్డారు. కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు వెయ్యి రోజులు కావస్తున్నా హామీల అమలుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను, రైతులను, నిరుద్యోగులను పక్కనపెట్టి ఎమ్మెల్యేపై అనవసర విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజలు ఓట్లు వేసి 19 వేల మెజారిటీతో గెలిపించిన పల్లా రాజేశ్వర్ రెడ్డిపై దొంగ ఓట్ల ఆరోపణలు చేయడం బాధాకరమని స్వామి గౌడ్ అన్నారు. అదే నిజమైతే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలంతా దొంగ ఓట్లతోనే గెలిచారా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా దొంగ ఓట్లతోనే గెలిచి ముఖ్యమంత్రి అయ్యారా? అని కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని ప్రశ్నించారు. గతంలో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రతాప్ రెడ్డి ఏం చేశారు అని అన్నారు.

# హక్కుల పరిరక్షణలో రాజీ లేదు

- ఎస్సీ, ఎస్టీ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే చర్యలు
- అట్రాసిటీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య









**సిద్దిపేట, సెప్టెంబర్ 29 , (ప్రజాజ్యోతి):** ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో ల్యాండ్ అట్రాసిటీస్, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ తదితర అంశాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్‌లతో కలిసి నిర్వహించిన సమావేశంలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానం, పెండింగ్ ఖాళీలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ చట్టపరిధిలో పనిచేసిందన్నారు. అక్టోబర్ 4తో తమ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దళితులు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలను వివరించారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టే సమయంలో రోస్టర్ పాయింట్లను తప్పనిసరిగా పాటించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధితులతో మానవీయంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు తమ సమస్యలపై కార్యాలయాలకు వచ్చినప్పుడు వారికి గౌరవంతో స్పందించాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ఎస్సీ, ఎస్టీలకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎస్సైలు, డీవీఎంసీ సభ్యులు, సంబంధిత అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అర్హులకు అవగాహన కల్పించి వాటిని పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కేటాయించిన నిధులను అదే వర్గాల సంక్షేమానికి వినియోగించాలని స్పష్టం చేశారు. నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదులు వచ్చిన వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని పోలీసులను కోరారు. బాధితులకు పరిహారం, న్యాయం అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌కు సంబంధించిన రాష్ట్రవ్యాప్తంగా 102 కోట్ల రూపాయల బకాయిలను అక్టోబర్‌లో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు తదితర అంశాలపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం ఇమాంబాద్‌లో భోజనాల వద్దన విషయంలో జరిగినట్లు వచ్చిన వివక్ష ఆరోపణలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బక్కి వెంకటయ్య సమర్థవంతంగా పనిచేశారని అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదలైన వెంటనే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ప్రాధాన్యతతో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. 60 రోజుల్లో దర్యాప్తు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి నెల డివిజన్ల వారీగా కేసులను సమీక్షిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూస్తున్నామని తెలిపారు. అనంతరం అక్టోబర్ 4తో కమిషన్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆధ్వర్యంలో అధికారులు కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజా గంగారాం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ విజయ్ భార్గవ్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, ఏసీపీలు, జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ..టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక బోధన

- పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య





**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 29:** పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడంతో పాటు, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య తెలిపారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో బోధన అందిస్తున్నామన్నారు. ఉదయం పాఠశాల సమయానికి ముందు, సాయంత్రం పాఠశాల అనంతరం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతుల్లో సందేహ నివృత్తి, పునశ్చరణ, ప్రశ్నపత్రాల సాధన, పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ రోజు పదో తరగతి విద్యార్థులకు గణితంపై ప్రత్యేక తరగతిని నిర్వహించి, ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకంగా బోధన అందించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరై, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా పంపించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహా రెడ్డి, ఖదీర్ పాషా, విజయ్, శైలజ, అర్చన, రాధిక, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి




**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి):-** గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆనంద్ రాజ్ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రజలకు పలు సూచనలు చేశారు. గుండె జబ్బులు వయసుతో సంబంధం లేకుండా ఎవరికైనా వచ్చే అవకాశం ఉందని, ప్రారంభ దశలో లక్షణాలను గుర్తించి వైద్యులను సంప్రదించడం ద్వారా తీవ్ర సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ప్రపంచ హార్ట్ ఫెడరేషన్ 2026లో 'డోంట్ మిస్ ఎ బీట్' పేరుతో గుండె జబ్బుల లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అధిక రక్తపోటు, మధుమేహం, అధిక బరువు, ధూమపానం, వ్యాయామం లేకపోవడం, కొవ్వు పదార్థాలు అధికంగా తీసుకోవడం గుండె జబ్బులకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని అన్నారు. ఛాతీలో నొప్పి లేదా బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక చెమటలు, అకస్మాత్తుగా అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఉప్పు--చక్కెర వినియోగాన్ని తగ్గించడం, పొగాకు--మద్యపానానికి దూరంగా ఉండటం, రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించారు. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు మరింత ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# నానో యూరియాతో అధిక దిగుబడి




**నంగునూర్ సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):-** రైతులందరూ నానో యూరియా ను వాడి అధిక అధిక పంటలను పండించుకోవచ్చు అని అగ్రికల్చర్ ఏ డి ఏ పద్మ అన్నారు మంగళవారం నాడు మండల పరిధిలోని వెంకటాపూర్ లోని రైతు వేదికలో నానో యూరియా పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ అవగాహన సదస్సు కు ముఖ్యఅతిథిగా ఏడిఏ హాజరై సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలకు వాడే ఎరువులు అధికంగా వాడకూడదన్నారు రైతులు మొదట భూసార పరీక్షలు చేసి భూసార పరీక్షల్లో రిపోర్టుల ఆధారంగా భూమికి కావలసిన ఎరువు మోతదు లో వాడాలన్నారు నానో యూరియా పంటల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు కావున రైతులందరూ నానో యూరియాను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో లు గీత జాయిన్ పామాయిల్ అధికారి నితిన్ ఏఈఓ మౌనిక ఇఫ్కో ప్రతినిధులు ట్రైని అక్బర్ ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ పృథ్వి నానో యూరియా డీలర్ సహస్ర ఫర్టిలైజర్ కృష్ణమూర్తి గౌడ్ పాల్గొన్నారు

# పంట వైవిధ్యీకరణకై రైతులకు కంది విత్తనాల పంపిణీ

- తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట శాస్త్రవేత్త పల్లవి








**తొగుట, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి):** పంటల వైవిధ్యీకరణ కోసం రైతులకు కంది విత్తనాల పంపిణీ చేసినట్లు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట శాస్త్రవేత్త డా. పల్లవి తెలిపారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట, వ్యవసాయ శాఖ సంయుక్త అద్వర్యంలో పంట వైవిధ్యకరణలో భాగంగా సిద్ధిపేట జిల్లా తొగుట మండలం లోని పెద్దమాసాన్ పల్లి రైతు వేదికలో విత్తనోత్పత్తిలో భాగంగా టిడిఆర్జి- 59 అనే కంది రకంను ఎల్లారెడ్డిపేట్ గ్రామ రైతులకు 25 ఎకరాలకు సరిపడా విత్తనాన్ని అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట శాస్త్రవేత్త డా. పల్లవి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన కంది విత్తనాలను అందించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, టిడిఆర్జి-59 అనే కంది రకం మధ్యకాలిక రకమని, వీటిని అక్టోబర్ మెదటి వారం లో విత్తుకున్నట్లయితే ఫిబ్రవరి చివరి వారంలో కోతకు వస్తుందని, దిగుబడి 7 క్వింటాళ్ళ వరకు వస్తుందని తెలిపారు. ఈ రకం ఎండు తెగులు, గొడ్డు మూతి తెగులును సమర్ధవంతంగా తట్టుకుంటుందని, విత్తనోత్పత్తికి అనుకూలంగా ఉంటుదని తెలిపారు. తర్వాత తెలంగాణ సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్య రాణి, రీజినల్ మేనేజర్ అతుల్ జైన్ లు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, విత్తనోత్పత్తి వివిధ దశల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట వైవిధ్యీకరణ అంటే ఒకే పొలంలో ఒకే రకమైన పంటను తిరిగి పండించకుండా, విభిన్న రకాల పంటలను మార్పిడి పద్ధతిలో లేదా అంతర పంటలుగా పండించడమని,. సాంప్రదాయకంగా వేసే వరి, పత్తి వంటి ఒకే రకమైన పంటల స్థానంలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, తోట పంటలను సాగు చేయడమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పద్ధతిని పాటించడం వల్ల రైతులకు, భూమికి జరిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్, గ్రామ సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

# ఆర్వీఎం ఆస్పత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరం

- పలువురికి ఉచిత పరీక్షలు






**ములుగు, సెప్టెంబర్29(ప్రజాజ్యోతి)** అంతర్జాతీయ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు మండలం లక్ష్మక్క పల్లి సమీపంలోని ఆర్వీఎం ఆసుపత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి గుండె సంబంధించిన రోగులకు ఉచితంగా ఈసీజీ, 2డి ఈకో, కొవ్వు పరీక్ష ఆర్ పి ఎస్ ర్యాండం బ్లడ్ షుగర్ ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అనారోగ్యం సమస్యలతో బాధపడే వారికి ఇలాంటి వైద్య శిబిరాల వల్ల మేలు కలుగుతోందని, గుండె సమస్యలు ఉన్నవారికి ఆసుపత్రి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించడం సంతోషంగా ఉందని వైద్య శిబిరానికి వచ్చిన రోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్‌డెంట్ డా శ్రీనివాస్, గుండె సంబంధిత వైద్యులు డా భాను కిరణ్ రెడ్డి, డా లక్ష్మీనారాయణ, సీఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్పూర్ పాఠశాలలను సందర్శించిన మండల విద్యాధికారి ఎం.అంజయ్య

**రికార్డులు, బోధన విధానం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు**



**పరిగి, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి):** పరిగి మండల విద్యాధికారి (ఎంఈవో) ఎం. అంజయ్య మంగళవారం సాధారణ తనిఖీలలో భాగంగా సుల్తాన్పూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించడంతో పాటు తరగతి గదుల్లో బోధన విధానాన్ని గమనించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ నంబర్--2 పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. సమావేశ నిర్వహణ తీరు, విద్యా ప్రణాళికల అమలు, ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. తదుపరి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

## దొంగతనం కేసులో ముగ్గురు నేరస్తుల అరెస్ట్

**- 10 తులాల బంగారం రూ 1లక్ష నగదు స్వాధీనం**
**- వివరాలు వెల్లడించిన తాండూర్ డిఎస్పి నర్సింగ్ యాదయ్య**







**తాండూరు సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి :** తాండూరు పట్టణంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నేరస్తుల తాండూర్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అదుపు తీసుకున్న నేరస్తుల నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.1 లక్షల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. మంగళవారం రోజు తాండూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పరమేష్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తాండూర్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన అబ్దుల్ జహీర్ తన భార్యతో కలిసి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణంలో ఫోన్‌లో పరిశీలించగా ఇంటి వద్ద ఉన్న సీసీ టీవీ లో ఇద్దరు వ్యక్తులు అనుమాన స్పందనగా కనిపించినట్లు గుర్తు చేశారని చెప్పారు. ఇంటికి వచ్చి పరిశీలించగా ఇంట్లో ఉన్న బంగారం నగదు దోచుకెళ్ళినట్లు గుర్తించిన సదరు వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇట్టి విషయంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం తాండూర్ బస్ స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చిందని చెప్పారు.

అదుపులోకి తీసుకున్న నేరస్తులను రిమాండ్కు తరలించనట్లు చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ సిఐ పరమేశ్వర్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం జరుగుతున్న పోరాటంలో మరో ముందడుగు

**- గిరిజనుల మొర ఆలకించి అక్టోబర్ 1 నాడు సిద్దాపూర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్**
**- హుస్సేన్ నాయక్ పర్యటనను విజయవంతం చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జేఏసి పిలుపు.**



**కొత్తూరు సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) :** సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు చేయాలని గతంలో గిరిజన సర్పంచులు, గిరిజన సంఘాల నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను కోరటం వారు స్పందించి సిద్దాపూర్ డంపింగ్ యార్డు స్థల పరిశీలనకు అక్టోబర్ 1వ తేదీన వస్తుండటంతో మంగళవారం నాడు వైఎం తండాలో జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉమ్మడిగా సమావేశం నిర్వహించి హుస్సేన్ నాయక్ పర్యటన సందర్భంగా ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై మన సమస్యలను ఆయనతో చెప్పుకోవాలని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సిద్దాపూర్ డంపింగ్ యార్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 641 నీ రద్దు చేయాలని కోరుతూ గత నెల ఆగస్టు 22 వ తేదినాడు గిరిజన ప్రజా ప్రతినిధులు , గిరిజన సంఘాల నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను కలసి డంపింగ్ యార్డు వల్ల గిరిజనులు ఎక్కువగా నష్ట పోతారని, డంపింగ్ యార్డు రద్దు కోసం సహకరించాలని వినతిపత్రం ఇచ్చి నట్లు తెలిపారు. హుస్సేన్ నాయక్ వెంటనే స్పందిస్తూ ఆగస్టు 31 నాడు కలెక్టర్ మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కు 15 రోజుల్లో నివేదికలు ఇవ్వమని నోటీస్ లు కోడా జారీచేశారు అన్నారు. అంతే కాకుండా అక్టోబర్ 1 వ తేదీన సిద్దాపూర్ లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుకుంటారని, ఇది ఒక పోరాట మలుపు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, నాయకులు శేఖర్ రెడ్డి, సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్, వైఎం తండా సర్పంచ్ గోవింద్ నాయక్, మాజీ ఎంపీటీసీ రాంచందర్, మాజీ సర్పంచ్ రమేష్ నాయక్, నాయకులు బాబు రాజు నాయక్, జైపాల్ నాయక్, సీతారం నాయక్, రాములు నాయక్, నార్యా నాయక్, పాపయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విధ్యార్ధులకు ముత్తూట్ ఎం.జార్జ్ ఎక్సలెన్స్ అవార్డులు



**దోమ సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** ముత్తూట్ గ్రూప్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా, ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు "ముత్తూట్ ఎం. జార్జ్ ఎక్సలెన్స్ అవార్డ్స్" (17వ ఎడిషన్) కార్యక్రమాన్ని మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ముత్తూట్ లెర్నింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ పరిధిలోని దోమ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న తొమ్మిదవ తరగతి టాపర్‌గా గౌర్వర్ అంకిత్ రావ్, ఎనిమిదవ తరగతి టాపర్‌గా అనుజ్ కుమార్ ప్రతిభావంతులని గుర్తించి నగదు పురస్కారాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాల్లో భాగంగా ఒక్కో విద్యార్థికి 3,000 నగదు పారితోషికం, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ముత్తూట్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. గడిచిన 17 ఏళ్లలో ముత్తూట్ ఫైనాన్స్ ద్వారా 7 రాష్ట్రాల్లో సుమారు 1,500 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలిచిందని, ఇప్పటివరకు మొత్తం 13,411 స్కాలర్‌షిప్‌లను అందిస్తూ సుమారు 3.75 కోట్ల విలువైన ఆర్థిక సాయాన్ని విద్యాభివృద్ధికి కేటాయించిందన్నారు. అనంతరం హెచ్. మహేష్ బాబు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కమీషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, హైదరాబాద్, ఆచార్య రమేష్ గురూజీ విశిష్ట అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. సామాజిక సేవా రంగాలు (సిఎస్ఆర్ ఫోకస్ ఏరియాస్)ముత్తూట్ గ్రూప్ తన సిఎస్ఆర్ నిధుల్లో అత్యధిక భాగం (సుమారు 70%) విద్యా రంగానికే వెచ్చిస్తోంది. విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ (ముత్తూట్ స్నేహాశ్రయ ఉచిత హెల్త్ క్యాంప్‌లు), సురక్షితమైన తాగునీటి సదుపాయం, సమాజ అభివృద్ధి కార్యక్రమాలను కూడా సంస్థ నిరంతరం నిర్వహిస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు గౌడ్, తల్లి తండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు పట్టణాన్ని ఆదర్శవంతంగా మారుద్దాం







- పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటన
- పాఠశాలలు అంగన్వాడీలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- ఎస్ఐఆర్ నమోదులో బిఎల్ఓల పాత్రే కీలకం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు సెప్టెంబర్ 29 ప్రజా జ్యోతి :** తాండూర్ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిదెందుకు అందరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రోజు తాండూరు పట్టణంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్" కార్యక్రమంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఒకటో వార్డ్ నుండి ఆరో వార్డు వరకు గల ప్రాంతంలో పారిశుద్ధ్య వ్యవస్థ పరిశీలన స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరచడం కోసం అనేక ప్రణాళికలు చేసినప్పటికీ ప్రస్తుతం ఏ మేరకు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయో తెలుసుకోవడం కోసం స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని మల్ రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులతో కలిసి అల్పాహారం చేసి విద్యార్థుల తో ఆప్యాయంగా ముచ్చటించారు.

పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ తదితర అంశాలపై ఎమ్మెల్యే స్వయంగా ఆరా తీశారు.

పాఠశాలను తనిఖీ చేసిన క్రమంలో విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, బోధన, తరగతుల నిర్వహణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అదేవిదంగా వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణ తదితర అంశాలను దగ్గరుండి పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, రోడ్లు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు రాత్రి వేళలో ప్రజలకు ఇబ్బంది రాకుండా వీధుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలతో మందులను పిసికారి చేయించాలన్నారు. మురుగు కాలువల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటి చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు.

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా చేపట్టిన పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పట్టణ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, స్వచ్ఛమైన తాండూరు నిర్మాణంలో మున్సిపాలిటీకి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. వార్డుల్లో కొనసాగుతున్న సబ్ సెంటర్ ను, అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్వాడి టీచర్ అదనంగా బిఎల్ఓ బాధ్యతలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కమిషనర్ రాకేష్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, వార్డు కౌన్సిలర్ లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ముద్దం నర్సింహ యాదవ్ పర్యటన





**- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**బోయిన్ పల్లి, సెప్టెంబర్ 29.(ప్రజా జ్యోతి) :** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలిసి మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం డివిజన్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో సుమారు 4.90 లక్షల ఓట్లు ఉండగా, ఇప్పటివరకు సుమారు 1.10 లక్షల ఓట్లు మాత్రమే ఎస్ఐఆర్ ప్రక్రియలో నమోదైనట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. నోటీసులు అందిన ఓటర్ల విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల్లో అయోమయం నెలకొనే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో గతంలో సుమారు 60 వేల ఓట్లు ఉండగా, ప్రస్తుతం కేవలం 9 వేల ఓట్లు మాత్రమే ఉన్నట్లు అధికారులు ధృవీకరించడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. బోయిన్‌పల్లిలోని పలు భూములను 22-ఏ పరిధిలో చేర్చిన అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ అంశంపై అసెంబ్లీలో మాట్లాడేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. అభివృద్ధి విషయంలో గతంలో తమ ప్రభుత్వం చేసిన పనులే ఉన్నాయని, గత మూడు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సౌందర్య, వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, రాజేష్, కృష్ణ, కాలనీ అధ్యక్షుడు లూయిస్, వైస్ ప్రెసిడెంట్ నిరంజన్, సెక్రటరీ సతీష్, సింహం, వేణు, రామేశ్వర్, శంకరయ్య, సంతోష్, ఉమాపతి, శంకర్ గౌడ్, సురేష్, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, సెక్రటరీ హరినాథ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్ రావు, మహిళా అధ్యక్షురాలు లలితగౌడ్, ఉదయారాణి, సునంద, సంతోషి తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి

- జింక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- లిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ రామ్ రాజ్
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శంషాబాద్‌లో లిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఘనంగా 3కే రన్
- పాల్గొన్న లిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ రామ్ రాజ్, వివిధ పార్టీల నాయకులు







**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) :** ప్రతి ఒక్కరూ వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలని లిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ రామ్ రాజ్ పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్‌డే) సందర్భంగా శంషాబాద్ లోని లిమ్స్ న్యూరో, కార్డియాక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్లోని బస్టాండ్ చౌరస్తాలో డాక్టర్ రామ్ రాజ్, డాక్టర్ కార్తీక్ బాబు, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ కిరణ్ తేజ అవగాహన కల్పించి అనంతరం పాల్గొన్న స్థానిక వివిధ పార్టీల నాయకులతో కలిసి 3కే రన్ నిర్వహించారు. శంషాబాద్ బస్ స్టాండ్ చౌరస్తా నుండి ప్రారంభమైన ఈరన్ రాళ్లగూడ రోడ్డు మీదుగా తొండుపల్లి లోని లిమ్స్ హాస్పిటల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో శంషాబాద్ పట్టణ, మండల ప్రజలే కాకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు, డాక్టర్లు, నర్సులు, వాకర్స్, పెద్ద ఎత్తున పాల్గొని గుండె ఆరోగ్యం పై అవగాహన నినాదాలు చేశారు. అనంతరం 3కే రన్‌లో పాల్గొన్న వారందరికీ హాస్పిటల్ యాజమాన్యం సర్టిఫికెట్లు అందజేశారు.

లిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ రామ్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో వయస్సుతో సంబంధం లేకుండా చిన్న వయసు వారికి కూడా గుండెపోటు రావడం సాధారణమైపోయింది. దీనికి ప్రధాన కారణాలు మనం తీసుకునే సరైన ఆహారం లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం, రోజు నడవకపోవడం, విపరీతమైన పని ఒత్తిడి వంటివి. ప్రజల్లో గుండెపోటు రాకుండా ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, ఆరోగ్యమైన జీవనశైలి ఇలా పాటించాలి అనే అంశంపై అవగాహన కల్పించేందుకే ఈ 3కే రన్ నిర్మించాం అని ఆయన తెలిపారు. రోజు కనీసం 30 నిమిషాలు నడవడం, జింక్ ఫుడ్ కు దూరంగా ఉండటం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వైద్యులు ఈ సందర్భంగా సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం శంషాబాద్ మండలం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్, శంషాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్, కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి శేఖర్, శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, బిఆర్ఎస్ పార్టీ కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షుడు కొనమల శ్రీనివాస్, శంషాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రావు, నాయకులు గణేష్ గుప్తా, మహేందర్ రెడ్డి, చింతల నందకిషోర్, వంశి యాదవ్, విట్టల్ నాథ్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, ఆయిల్ కుమార్, జయసింహ, గౌస్ పాషా, రాజిరెడ్డి, రాము నాయక్, బైతి శ్రీధర్, శ్రీనివాస్ యాదవ్, ఆనంద్, రాహుల్, వెంకట్ రెడ్డి, లిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాధారణంగా మండల సర్వసభ్య సమావేశం

**- అధికారులు సర్పంచ్లతో సమన్వంతో పనిచేయాలి**
**- తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**




**తాండూరు సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి :** తాండూరు మం డలం సర్వసభ్య సమావేశం సాధారణంగా జరిగింది. మండ లానికి చెందిన పలు గ్రామాల సర్పంచులు వివిధ శాఖల అధికారులతో స్థానిక ఎంపీడీవో విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామ అభివృద్ధికి తోడ్పడును అందించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశిం చారు. ముఖ్యంగా మంచినీటి, విద్యుత్తు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తు తం ప్రభుత్వం ద్వారా మంజూరైన డ్వాక్రా భవనాలు ఇతర అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రత్యేక అధికారి ఎమ్మెల్యే సత్తార్ పలు గ్రామాల సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం

**ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం: ఎమ్మెల్యే శ్రీగణేష్**



**బోయిన్ పల్లి, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి) :** కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నవ కంటోన్మెంట్ నిర్మాణంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. వార్డు-4 పికెట్ పరిధిలోని హరిజన బస్తీ, శ్రీరామ్ నగర్, సంతోషిమాత టెంపుల్ బస్తీలలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు లేవనెత్తిన సీవరేజ్, విద్యుత్, మంచినీటి సరఫరా, రోడ్ల నిర్మాణం తదితర సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన భూముల బదలాయింపు ప్రక్రియ ద్వారా వచ్చిన రూ.338 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధులతో నియోజకవర్గంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి, సంబంధిత శాఖల అధికారులు, కంటోన్మెంట్ బోర్డు అధికారులతో ఇప్పటికే చర్చించామని, వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాలు సక్రమంగా లేకపోవడంతో నీటి కొరత ఏర్పడిందని పేర్కొంటూ, నియోజకవర్గ ప్రజలందరూ మంచినీటిని పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో బస్తీవాసులు పాల్గొన్నారు.

## 30న సోల్వేజ్ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ ఐపీఓ ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) :** సోల్వేజ్ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఐపీఓ సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 5 వరకు కొనసాగనుందని సోల్వేజ్ స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉమేష్ కుమార్ అగర్వాల్ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రీమియం ఆడియో, వీడియో, హోమ్ ఆటోమేషన్ విభాగాల్లో మార్కెట్ ఉనికిని, వినియోగదారుల అనుభవాన్ని విస్తరించడమే లక్ష్యమన్నారు. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో లిస్టింగ్‌కు ప్రతిపాదించిన ఈ ఇష్యూలో రూ.55 ధరతో 39.60 లక్షల షేర్ల ద్వారా రూ.21.78 కోట్లు సమీకరించనుందని తెలిపారు. మార్కెట్ లాట్ 2 వేల షేర్లు కాగా, రిటైల్ పెట్టుబడిదారుల కనీస దరఖాస్తు రూ.2.20 లక్షలుగా పేర్కొన్నారు. ఫిన్‌షోర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

## తోటి జర్నలిస్టుకు ఆపదొస్తే.. మేమున్నాము

మెట్ పల్లి ఐజేయూ ప్రెస్ క్లబ్

గాయపడిన జర్నలిస్టు నాగరాజుకు రూ.22 వేల ఆర్థిక సాయం

మెట్‌పల్లి, సెప్టెంబర్ 29,(ప్రజా జ్యోతి: జర్నలిస్టు కష్టాల్లో ఉంటే తామున్నామంటూ ఐజేయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అండగా నిలిచింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నాగరాజును ఐజేయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న నాగరాజుకు ఐజేయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.22,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు.. మెరుగైన వైద్యం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.





జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో వారి కుటుంబాలకు అండగా నిలవడం జర్నలిస్టు సంఘాల బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఐజేయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఒక్కటిగా నిలిచిన జర్నలిస్టు సమాజం

తోటి జర్నలిస్టు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో జర్నలిస్టు సమాజం ఒక్కటిగా స్పందించడం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. నాగరాజు త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఐజేయు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షులు మహమ్మద్ అఫ్రోజ్‌తో పాటు ప్రింట్ మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. నాగరాజుకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని వారు ఆకాంక్షించారు.

## ధర్మారంలో భూ సర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ



కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి) కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామంలో కొనసాగుతున్న భూ సర్వే పనులను కోరుట్ల ఆర్డీఓ. ఎల్. జీవాకర్ రెడ్డి, ఎమ్మార్వో కృష్ణ చైతన్య, సర్పంచ్ రంజిత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దులు, భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియను అధికారులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. భూ సర్వే పనులు పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## సామాన్య కార్యకర్త నుంచి మార్కెట్ చైర్మన్‌గా అవకాశం

ఎమ్మెల్యే విజయరమణారావుకు ఎల్లవేళలా కృతజ్ఞతలు: మార్కెట్ చైర్మన్.

ఎలిగేడు, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి)

సామాన్య కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న తనపై నమ్మకం ఉంచి ఎలిగేడు మండల నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుకు ఎల్లవేళలా కృతజ్ఞతగా ఉంటానని నూతన మార్కెట్ చైర్మన్ పోట్టాల రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు ఆశీస్సులతోనే తనకు ఈ పదవి దక్కిందని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేసే సామాన్య కార్యకర్తలకు కూడా తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయనేందుకు తనకు లభించిన మార్కెట్ చైర్మన్ పదవే నిదర్శనమని అన్నారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, పార్టీకి ఎల్లవేళలా అంకితభావంతో సేవ చేస్తానని పోట్టాల రమేష్ స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే విజయ రమణారావుకు ఉమ్మడి ర్యాకల్ దేవ్ పల్లి, రాముల పల్లె గ్రామ సర్పంచ్ లు రమాదేవి సంపత్, సిద్ధి తిరుపతి గ్రామ ప్రజల తరపున పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావుకు విప్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## ఎమ్మెల్యే ధర్నా రాజకీయ నాటకం

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):

కాంగ్రెస్ వైఫల్యాలు, ఇచ్చిన హామీలను కప్పిపుచ్చుకునేందుకే ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు రాజకీయ నాటకాలకు తెరతీస్తున్నారని బీజేపీ నాయకులు విమర్శించారు. పెద్దపల్లి పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ పెంజర్ల రాకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానంద మాట్లాడుతూ.. కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే చేపట్టిన ధర్నా ప్రజల దృష్టిని మళ్లించేందుకేనని ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ముందు పెద్దపల్లి నియోజకవర్గం లోని కాంగ్రెస్ సర్పంచుల పరిధిలో ఎంతమంది ఓట్లు తొలగించారో గ్రామాల వారీగా ఆధారాలతో వెల్లడించాలని డిమాండ్ చేశారు.



2002లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఇప్పుడు అదే అంశంపై ఎన్నికల సంఘాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, నకిలీ, డబుల్, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం సరిచేయడం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, మహిళలకు సాయం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్, చిలివేరి సంపత్, సీనియర్ నాయకులు తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, గర్రెపల్లి నారాయణస్వామి, వెల్లంపల్లి శ్రీను, జ్యోతిబాస్, తూడు రవి తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు
- నేడు కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ ప్రారంభం
- సిరిసిల్లలో భారీ బహిరంగ సభ
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి): ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రేపు కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి.. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.





పూల అలంకరణ.. పార్కింగ్, భద్రతపై ప్రత్యేక దృష్టి

నూతన సమీకృత కలెక్టరేట్ భవనం, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని, పూల అలంకరణ, పరిశుభ్రత, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. హెలిప్యాడ్‌ను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

సీఎం పర్యటనలో భాగంగా నూతన కలెక్టరేట్ భవనం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిస్తారు. కలెక్టర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, కలెక్టర్‌ను సీట్లో ఆసీనులను చేసి అధికారికంగా పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు.

జిల్లా అభివృద్ధిపై సీఎం సమీక్ష

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధిపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ డెవలప్‌మెంట్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నారు.

కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కరీంనగర్ అభివృద్ధికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, సంక్షేమ రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధితో పాటు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజినీరింగ్ విద్యా అవకాశాలను పెంచామని తెలిపారు.

సంక్షేమ పథకాలకు పెద్దపీట

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రైతులకు బోనస్, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. నిరుద్యోగులకు 70 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టామని, విద్యార్థుల సంక్షేమం కోసం హాస్టళ్లలో డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచామని చెప్పారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, గౌరవెల్లి, కలికోట సూరంపేట తదితర ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి పెట్టామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.250 కోట్లు కేటాయించామని, మిడ్ మానేరు ప్రాజెక్టు బాధితుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

మానేరు రివర్‌ఫ్రంట్, రింగ్‌రోడ్డుపై దృష్టి

మానేరు రివర్‌ఫ్రంట్, డంపింగ్ యార్డ్, కరీంనగర్ రింగ్ రోడ్డు వంటి కీలక అభివృద్ధి అంశాలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ, పారిశ్రామిక, విద్యా, వైద్య రంగాల్లో జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.

సిరిసిల్లలో భారీ బహిరంగ సభ

కరీంనగర్ పర్యటన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వెళ్లనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించి, అనంతరం భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. నేతన్నల సమస్యలు, పాత బకాయిల చెల్లింపులు, చేనేత, పవర్‌లూమ్ రంగానికి ప్రభుత్వ అండ వంటి అంశాలపై సీఎం భరోసా కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం పర్యటనలోని అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఓ స్త్రీ.. ఇది నీకు తగునా?

ప్రశ్నార్థకంగా మారిన మానవ సంబంధాలు..

చిన్నారుల భవిష్యత్తుపై నీలి నీడలు

పెళ్లి అంటేనే జంకుతున్న యువకులు

మల్యాల,సెప్టెంబర్ 29, ప్రజా జ్యోతి : పవిత్రమైన బంధాలు, నమ్మకాల పునాదులపై నిర్మితమయ్యే మానవ సంబంధాలు నేడు తీవ్ర విచ్ఛిన్నానికి గురవుతున్నాయి. క్షణికావేశాలు, తాత్కాలిక ఆకర్షణల కోసం క్రమబద్ధమైన సంసార జీవితాన్ని బలిపీఠంపై ఎక్కిస్తున్న సంఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. మల్యాల మండలంలో వరుసగా జరుగుతున్న ఘటనలు మానవాళి ముక్కున వేలు వేసుకునేలా ఉంటున్నాయి. "ఓ స్త్రీ.. ఇది నీకు తగునా?" అని సమాజం నిలదీసేలా సాగుతున్న కొన్ని దారుణ వైపరీత్యాలు కుటుంబ వ్యవస్థను పాతాళానికి నెట్టేస్తున్నాయి. మల్యాల మండలంలోని ఓ గ్రామంలో తాజాగా మిస్సింగ్ కేసుగా నమోదైన కేసును పోలీసులు చేదించే సమయంలో ఇద్దరు పిల్లలు కలిగిన తల్లి పక్కింటి అబ్బాయితో లేచిపోయి స్టేషన్ కు రావడం స్థానికంగా దుమారం లేపింది. భర్త అందుబాటులో ఉండి ఆర్థికంగా ఎలాంటి సమస్య లేకుండా ఉన్న ఆ కుటుంబంలో చిచ్చు ఎలా మొదలైందో కానీ పక్కింటి అబ్బాయి రూపంలో వారి జీవితాలను కాకావికలం చేసింది. యవ్వనం సరే వృద్ధాప్యంలో తన పరిస్థితి ఏంటి అని ఆలోచన లేకుండా ఓ స్త్రీ వేసిన తప్పటడుగు ఆ కుటుంబాన్ని అధఃపాతాలానికి నెట్టేసింది.

చిన్నారుల భవిష్యత్తుపై నీలి నీడలు

తల్లిదండ్రుల స్వార్థం, నైతిక విలువల క్షీణతకు ఏ పాపం ఎరుగని అమాయక చిన్నారులు బలైపోతున్నారు.



అమ్మానాన్నల ప్రేమ, రక్షణ లభించాల్సిన వయసులో వారి బాధ్యతారాహిత్యం వల్ల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. మానసిక వేదన, సరైన పోషణ లేకపోవడం, చదువుకు దూరమవ్వడం వంటి పరిణామాలు వారి జీవితాలపై తీవ్రమైన నీలి నీడలను పరుస్తున్నాయి. తల్లి దారి తల్లి చూసుకొని పక్కింటి అబ్బాయితో వెళ్లిపోతే యవ్వనం మీద ఉన్న తండ్రి మరొక పెళ్లి చేసుకుంటే ఆ పిల్లల పరిస్థితి అనాధాల కంటే అధ్వానంగా మారుతుంది. చేసేదేమీ లేక తాను కూడా ఒంటరిగా మిగిలితే తల్లి చేసిన తప్పుకు జీవితాంతం తలదించుకొని బతకాల్సిన పరిస్థితి ఆ పిల్లలది. తల్లిదండ్రుల తప్పులకు ఈ చిన్నారులు ఏ నేరం చేశారని అనుభవించాలి? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తున్నాయి.

సక్రమమైన బంధాన్ని వదిలి.. అక్రమానికే మొగ్గు!

నమ్మకంతో అడుగుపెట్టిన పెళ్లి పీటలను, అగ్నిసాక్షిగా చేసుకున్న ప్రమాణాలను పక్కనపెట్టి, అక్రమ సంబంధాల వైపే మొగ్గుచూపుతున్న ధోరణి ఇటీవల సమాజంలో పెరిగిపోతోంది. కుటుంబ పరువు, జీవిత భాగస్వామి నమ్మకం, పిల్లల భవిష్యత్తు కంటే వ్యక్తిగత స్వార్థమే పరమావధిగా భావిస్తుండటంతో నైతిక విలువలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. సక్రమంగా సాగుతున్న సంసారాన్ని కూల్చుకుని, దారి తప్పే నిర్ణయాలు చివరకు కుటుంబాల విచ్ఛిన్నానికే దారితీస్తున్నాయి. తనకు ఉన్నదాంట్లో పిల్లలకు భార్యకు పెద్దపీట వేస్తూ ఆర్థిక భారం మోస్తున్న భర్త కు చివరికి నమ్మకద్రోహం మిగులుతుంది. అందరూ స్త్రీమూర్తులు అలా లేకపోయినా సమీపంలో జరిగే ఘటనలు కొన్ని కలవర పెడుతున్నాయి.

పెళ్లి అంటేనే యువకుల్లో వణుకు!

సమాజంలో వరుసగా వెలుగుచూస్తున్న ఇలాంటి దారుణాలు నేటి యువతపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకప్పుడు పవిత్రంగా భావించిన వివాహ వ్యవస్థపై యువకుల్లో తీవ్ర భయం, అపనమ్మకం ఆవహిస్తున్నాయి. "రేపు నా జీవితంలోనూ ఇలాగే జరిగితే పరిస్థితి ఏంటి?" అనే ఆందోళన వారిని వెంటాడుతోంది. ఆర్థిక ఇబ్బందులు,
మానసిక ఒత్తిళ్లు, చట్టపరమైన చిక్కులు, నమ్మకద్రోహాల వార్తలు చూసి పెళ్లి పేరు వింటేనే యువత జంకే పరిస్థితి దాపురించింది.

పరిష్కారం దిశగా..

కుటుంబం అనేది కేవలం ఇద్దరి కలయిక మాత్రమే కాదు. అది రాబోయే తరాల నాణ్యతను, సమాజ భవిష్యత్తును నిర్ణయించే శక్తి. బంధాలలో నమ్మకం, పారదర్శకత, పరస్పర గౌరవం తగ్గినప్పుడే ఇలాంటి వ్యవస్థాగత లోపాలు బయటపడతాయి. నైతిక విలువలను పునరుద్ధరించుకుంటూ, సమస్యలు వచ్చినప్పుడు వివేకంతో పరిష్కరించుకోకపోతే రాబోయే రోజుల్లో కుటుంబ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. దీంతో పాటుగా రాజ్యాంగంలో స్త్రీలకు ఉన్న చట్టాలను సవరణలతో పాటుగా అమాయకులైన పురుషులకు న్యాయం చేస్తూ అన్యాయంగా వ్యవహరిస్తున్న స్త్రీల తీరును న్యాయ స్థాన నిపుణులు గమనించాల్సిందిగా కోరుతున్నారు. చట్టం అందరికీ సమానమే అనే వాదనను వినిపిస్తున్నారు.

## యాసంగిలో సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నాయ్

మల్కాపేట 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయాలి, బీజేపీ డిమాండ్

కొనరావుపేట,సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి) యాసంగిలో సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నాయని కొనరావు పేట బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ,అన్నారు. మల్కాపేట రిజర్వాయర్ పరిధిలోని 9వ ప్యాకేజీ పనులను తక్షణమే పూర్తి చేసి, సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ , ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోనరావు పేట మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. వచ్చే (యాసంగి) సీజన్‌కు సరిపడా సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 2023లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చకపోవడం విచారకరమన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో కాల్వల (కెనాల్స్) నిర్మాణం



పూర్తి కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కాల్వలు, రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని కోరారు. నిర్లక్ష్యం వీడకుంటే రైతులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీజేపీ మండల మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్,బీజేపీ ఉప అధ్యక్షులు చింతల పరుశురాం , బూత్ అధ్యక్షులు పొన్నం మహేష్ పిల్లి వెంకట్, కాదర్ల వికాస్ , యశోద రాజు , గుండా శ్రీకాంత్,సామల గణేష్ వాసాల అభినయ్, జెట్టి శేషు , వేముండ్ల సాగర్ ,తాండ్ర ప్రతాప్ ,మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుమ్ముతో నిండిన పెద్దపల్లి రోడ్లు

చీపుర్లు పట్టి బీఆర్ఎస్ నాయకుల నిరసన

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 29 ప్రజాజ్యోతి: పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులు దుమ్ము, ధూళితో నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్ ఆరోపించారు. మంగళవారం ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రం సమీపంలోని రోడ్డుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చీపుర్లు పట్టి రోడ్లను ఊడ్చుతూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజకుమార్ మాట్లాడుతూ.. మాతా శిశు కేంద్రం, ఆసుపత్రులు, జూనియర్ కళాశాల, పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో రోడ్లు దుమ్ముతో నిండిపోవడంతో చిన్నారులు, రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ప్రతిరోజూ రోడ్లను శుభ్రం చేసేవారని, ప్రస్తుతం పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. కమాన్ రోడ్డు, జెండా రోడ్డు, సాగర్ రోడ్డు, కూనారం రోడ్డు, టీచర్స్ కాలనీ, బస్టాండ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దుమ్ము, ధూళి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు లైశెట్టి బిక్షపతి, పూదరి చంద్రశేఖర్, ఖదీర్‌ఖాన్, కౌన్సిలర్ వెన్నం సుజాత-రవీందర్, నాయకులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్-29 ప్రజా జ్యోతి;

ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయాల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, ప్రజల సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వరి నుంచి ఆయిల్‌పామ్ వైపు

ఎలిగేడు సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):

సంప్రదాయ వరి సాగు నుంచి ఆయిల్‌పామ్ సాగుకు మారిన ఎలిగేడు మండలం లోకపేట గ్రామానికి చెందిన వావిలాల రాజేశ్వరి రావు విజయవంతమైన ఆయిల్‌పామ్ రైతుగా నిలుస్తున్నారు. తోట దిగుబడికి రావడంతో ప్రతి రెండు నెలలకు ఒకసారి ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (ఎఫ్ఎఫ్‌బీ) విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. గతంలో వరి సాగు చేసిన రాజేశ్వరి రావు నీటి వినియోగం, సాగు ఖర్చులు, దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ఆయిల్‌పామ్ సాగును చేపట్టారు. తోట స్థిరపడిన తర్వాత క్రమం తప్పకుండా దిగుబడి పొందే అవకాశం ఉండటం ప్రయోజనకరంగా ఉందని తెలిపారు. తోట పూర్తిస్థాయి దిగుబడికి వచ్చే వరకు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ ఎఫ్ఎఫ్‌బీ ధర మెట్రిక్ టన్నుకు రూ.24,025గా ఉండటం రైతులకు ప్రోత్సాహకరమని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అనుకూలమైన భూములు, నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజేశ్వరి రావు విజయగాథ వరి నుంచి ఆయిల్‌పామ్ సాగువైపు మారుతున్న రైతులకు ఆదాయ అవకాశాలను తెలియజేసే ఉదాహరణగా నిలుస్తోందన్నారు.



# చిన్నారులే వక్తలు..తల్లిదండ్రులే ప్రేక్షకులు..

◆ నారాయణ స్కూల్ ఘనంగా ప్రీ ప్రైమరీ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్




**సత్తుపల్లి సెప్టెంబర్29 (ప్రజా జ్యోతి)** పట్టణంలోని కాకర్ల పల్లె రోడ్డు లో గల నారాయణ స్కూల్ పి పి..1, పి పి..2 విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులే వక్తలుగా, తల్లిదండ్రులే ప్రేక్షకులుగా పాల్గొని,



విద్యార్థులు తమ ప్రతిభను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు వేదికపై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించడమే,ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి తెలిపారు.విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా వివరించి, వివిధ కార్యకలాపాలు మరియు ప్రదర్శనల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల చురుకుదనం, ఆత్మవిశ్వాసం, మాట్లాడే తీరు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఏ.జి.ఎం రాంకీ హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించి, చిన్నారులను అభినందించారు. అలాగే ఆర్ ఐ క్రాంతి , కోఆర్డినేటర్ నీలిమ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానమే కాకుండా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను వ్యక్తపరచే అవకాశాలను కల్పించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి ఎస్ ఎల్ సి వంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# క్రృతిమ మేధ అవగాహన సదస్సు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ కళాశాల టీ ఎస్కేసిలో -కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ కళాశాల విద్య కమీషనరేట్ తొ ఎంఓయు కుదుర్చుకున్న సంస్థ భారత్ కేర్స్ (సీఎస్ఆర్ బాక్స్ (గ్రూప్) ప్రతినిధి నాగసాయి క్రృత్రిమమేదస్సు, సైబర్ సెక్యూరిటీ లపై అవగాహన సదస్సు ను మంగళవారం నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు రానున్న రోజుల్లో అనేక రంగాల్లో క్రృతిమ మేధ కీలకమైనదని విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక అధ్యానంచేయాలని తెలిపారు కార్యక్రమంలో టీ ఎస్ కేసి కోఆర్డినేటర్ డా.చందా సుధాకర్,కెరీర్ గైడెన్స్ సెల్ ఆఫీసర్ డా.రాజశేఖర్ మెంటార్ వేలాద్రి విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోండి

◆ ఎమ్మార్వో వెంకటేశ్వర్లు




**కారేపల్లి, సెప్టెంబర్ 29, ప్రజా జ్యోతి:** నల్లగొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందని సింగరేణి మండల తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 01-11-2026 నాటికి గత మూడు సంవత్సరాల ముందు, అంటే 01-11-2023 నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. గత 2024 పట్టభద్రుల ఓటర్ల జాబితాలో ఇప్పటికే నమోదై ఉన్నవారు సైతం ఫారం--18 ద్వారా కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తాసీల్దార్ పేర్కొన్నారు.

# రుసుము లేకుండా ఎమ్మెల్సీ ఓటర్ నమోదు చేయాలి

◆ ప్రభుత్వమే ఉచితంగా ఓటు నమోదు చేపట్టాలి ◆ సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

◆ తహసిల్దార్ చల్లూరి సుధాకర్‌కు వినతిపత్రం అందజేసిన సిపిఐ నాయకులు



**బోనకల్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):** ఎమ్మెల్సీ ఓటు నమోదు పేరుతో మీసేవ కేంద్రాల్లో ఒక్కో అభ్యర్థి నుంచి రూ.100 చార్జీ వసూలు చేయడం సరికాదని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తీవ్రంగా విమర్శించారు. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోనకల్ మండలంలో సుమారు 3,500 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 4,000కు చేరే అవకాశం ఉందన్నారు. ఇంతమంది గ్రాడ్యుయేట్ల నుంచి ఓటు నమోదు కోసం రుసుము వసూలు చేయడం వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు నుంచి నలుగురు వరకు గ్రాడ్యుయేట్లు ఉండటం, వారిలో చాలామంది నిరుద్యోగులు, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో రూ.100 చార్జీ కూడా భారంగా మారుతోందని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య హక్కు అయినప్పుడు, దాని నమోదుకు రుసుము ఎందుకు అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను మీసేవ కేంద్రాలకే పరిమితం చేయకుండా ప్రభుత్వమే నేరుగా చేపట్టి, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును ఉచితంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసిల్దార్ చల్లూరి సుధాకర్ కు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, చిరునోముల శాఖ గ్రామ కన్వీనర్ గుంపుల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## షైన్ హైస్కూల్లో స్టూడెంట్

# కౌన్సిల్ ఎలక్షన్స్ ఫలితాలు వెల్లడి

**బోనకల్, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని స్థానిక షైన్ హైస్కూల్లో ఈనెల 19వ తారీఖున స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ ఎలక్షన్స్ ఫలితాలను మంగళవారం వెల్లడించారు. ఈ ఎలక్షన్స్ లో స్కూల్ హెడ్ బాయ్‌గా వేణు 9వ తరగతి, హెడ్ గర్ల్ గా మేధ 9వ తరగతి, డిసిప్లైన్ ఇన్చార్జిగా యామిని 9 వ తరగతి, డిప్యూటీ డిసిప్లేన్ ఇన్చార్జిగా ప్రణవి 5వ తరగతి,డిప్యూటీ హెడ్ బాయ్ గా లాల్ షకీల్ 6 వ తరగతి, డిప్యూటీ హెడ్ గర్ల్ గా శ్రీ ఉపేక్ష 8 వ తరగతి, హెడ్ స్పోర్ట్స్ ఇన్చార్జిగా వినయ్ 9వ తరగతి, డిప్యూటీ స్పోర్ట్స్ ఇన్చార్జిగా భాను ప్రకాష్ మరియు యువతేజ్ ఐదో తరగతి, స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్చార్జిగా గురుచరని ఆరో తరగతి, డిప్యూటీ స్పోకెన్ ఇంగ్లీష్ ఇన్చార్జిగా నఫీషా ఐదో తరగతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత ఎన్నికైన పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం

◆ పోలీసుల చర్యలకు కాంగ్రెస్ నాయకుల ప్రశంసలు




**చింతకాని, సెప్టెంబర్ 29 (ప్రజాజ్యోతి ):** చింతకాని మండలంలోని 26 గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరగడంపై కాంగ్రెస్ నాయకులు పోలీస్ శాఖను అభినందించారు. నిమజ్జన వేడుకల్లో శాంతిభద్రతలకు ప్రాధాన్యతనిస్తూ ముందస్తు చర్యలు చేపట్టిన చింతకాని ఎస్ఐ జి. నరేశ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు, ఘనంగా సత్కరించారు.డీజేల వినియోగంపై నిబంధనలకు అనుగుణంగా నియంత్రణ చర్యలు చేపట్టడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు నిర్వహించగలిగామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. డీజేల వినియోగాన్ని నియంత్రిస్తూ ప్రజలకు, వృద్ధులకు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం మంచి నిర్ణయమన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించిన ఎస్ఐ నరేశ్‌తో పాటు పోలీస్ సిబ్బందిని, సహకరించిన వినాయక ఉత్సవ కమిటీలనూ అభినందించారు ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యదవ్ మాట్లాడుతూ చింతకాని మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరగడం సంతోషకరమన్నారు. పోలీసుల సూచనలను ప్రజలు, ఉత్సవ కమిటీలు పాటించి సహకరించడం వల్లే నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయని తెలిపారు. అనంతరం ఎస్ఐ నరేశ్‌కు పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు, ఖమ్మం మార్కెట్ కమిటి మజి ఉపాధ్యక్షులు మదుపల్లి బాస్కర్ ,మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున,షేక్ కాసిం, చిన్నకేశవస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ఎండపల్లి శ్రీనివాసరావు,మండల కాంగ్రెస్ నాయకులు తిరుపతి యాదయ్య, ఏండి మజీద్, అలస్యం బసవయ్య, పంది మురళి, మాజీ ఎంపీటీసీ బొర్ర ప్రసాద్ ,నాగులవంచ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, నాగులవంచ దేవాలయ కమిటీ సభ్యులు వెచ్చ మంగపతిరావు, శిరసాని రమణప్రసాద్,గాంధీనగర్ ఉప సర్పంచ్ వంగూరి రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంచుమర్తి రామకృష్ణ,నాయకులు పరసగాని సతీష్, దేశబోయిన వెంకటేశ్వర్లు,తల్లూరి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ షాపా.. హాస్పిటలా?

◆ కాంపౌండర్ స్థాయి అర్హత కూడా లేదంటూ ఆరోపణలు.. ఆర్ఎంపీ పేరుతో వైద్యం?

◆ కమిషన్ల కోసం అవసరం లేని ఆపరేషన్లకు తరలిస్తున్నారంటూ ఫిర్యాదులు.. అధికారుల తనిఖీలు ఎక్కడ?



**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 29** అశ్వారావుపేట మండల పరిధిలో మామిళ్ల వారి గూడెం గిరిజన ప్రాంతాల్లో వైద్యం పేరుతో సాగుతున్న వ్యవహారాలపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. కనీస వైద్య అర్హతలు లేని వ్యక్తులు ఆర్ఎంపీ డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజలకు వైద్యం అందిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా వైద్య సేవల పేరుతో మెడికల్ షాపులనే ఆసుపత్రులుగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**అర్హత ఎంత? వైద్యం ఎంత?**

కాంపౌండర్ స్థాయిలో పనిచేసేందుకు కూడా తగిన అర్హతలు లేని వ్యక్తులు వైద్యులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు పూర్తి స్థాయి వైద్య పరిజ్ఞానం లేకపోవడంతో కొందరు వ్యక్తులు దీనిని ఆసరాగా చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్య సేవలు అందించే వ్యక్తుల విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలు, క్లినిక్ నిర్వహణకు ఉన్న అనుమతులు, వారు అందిస్తున్న వైద్య సేవల పరిధిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**కాసుల కోసం లేని రోగాలు అంటగడుతున్నారా?**

కొంతమంది రోగులకు అవసరం లేని పరీక్షలు, చికిత్సలు సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఖమ్మం, ఇతర నగరాల్లోని పెద్ద ఆసుపత్రులకు రోగులను తరలించి, అవసరం లేని ఆపరేషన్లు చేయిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.ఇవన్నీ కేవలం ఆరోపణలేనా? లేక వాస్తవంగా రోగులను రిఫర్ చేసి ఆపరేషన్లు చేయిస్తున్నారా? ఆపరేషన్లకు నిజంగా వైద్యపరమైన అవసరం ఉందా? రిఫరల్ వ్యవస్థలో ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత వైద్యశాఖ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**భార్యాభర్తలే వైద్యులు.. యజమానులే నిర్వాహకులా?**

ఒకే ప్రాంగణంలో మెడికల్ షాప్‌తో పాటు హాస్పిటల్ తరహాలో వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు మరింత ప్రశ్నలకు తావిస్తున్నాయి. భార్యాభర్తలు కలిసి ఈ వ్యవహారాన్ని నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ ఆర్ఎంపి వైద్యుడు ప్రతిరోజు చుట్టుపక్కల గిరిజన గ్రామాలలో తిరుగుతూ కూడా వైద్యం చేస్తాడట. మెడికల్ షాప్ నిర్వహణకు ఉన్న అనుమతులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌గా నమోదు, వైద్యుల రిజిస్ట్రేషన్, ఫార్మసీ లైసెన్స్, అక్కడ నిర్వహిస్తున్న చికిత్సల చట్టబద్ధత వంటి అంశాలను అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

**గిరిజనుల అమాయకత్వమే పెట్టుబడా?**

గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల సమీపంలో కనిపించే వ్యక్తిగత వైద్య సేవలపై ప్రజలు ఆధారపడే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా చలామణి అయితే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలంటే సంబంధిత శాఖలు కేవలం ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అర్హతలు, రిజిస్ట్రేషన్, లైసెన్సులు, క్లినిక్ నిర్వహణ అనుమతులు, రిఫరల్ విధానం తదితర అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

# ఢిల్లీలో దళిత-ఆదివాసీ సమావేశంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

◆ అట్టడుగు వర్గాల సమస్యలపై జాతీయ స్థాయి వేదికగా ఢిల్లీ సమావేశం ◆ దళిత, ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, విద్య, ఉపాధి అంశాలపై విస్తృత చర్చ

◆ అశ్వారావుపేట ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే






**అశ్వారావుపేట, సెప్టెంబర్ 29: ప్రజా జ్యోతి** దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన దళిత--ఆదివాసీ సమావేశంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళిత, ఆదివాసీ వర్గాలకు సంబంధించిన సమస్యలు, సామాజిక న్యాయం, అభివృద్ధి, విద్య, ఉపాధి, రాజ్యాంగ హక్కులు, సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గం గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలతో కూడిన నియోజకవర్గం కావడంతో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయి వేదికపై ప్రస్తావించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. గిరిజన గ్రామాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి, మౌలిక వసతుల కల్పన, వైద్య సదుపాయాల విస్తరణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించినట్లు తెలిపారు.

**అట్టడుగు వర్గాల అభివృద్ధే లక్ష్యంగా..**

దళిత, ఆదివాసీ వర్గాల అభివృద్ధి కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక ప్రాతినిధ్యం వంటి అన్ని రంగాల్లో సమగ్రంగా జరగాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే సంక్షేమ పథకాల అమలులో మరింత ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక గిరిజన గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రస్తావించినట్లు తెలిపారు. వర్షాకాలంలో మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు, అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల రవాణా వంటి అంశాలు ఇబ్బందికరంగా మారకుండా శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని, మంచి రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వివరించినట్లు తెలిపారు.

**గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు**

ఏజెన్సీ ప్రాంతాల్లో యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెంచడంపై ప్రత్యేక దృష్టి అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే గిరిజన విద్యార్థులకు అవసరమైన వసతి, శిక్షణ, మార్గదర్శకత్వం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు శిక్షణా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి మార్గదర్శకత్వం అందిస్తే వారు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోగలరని తెలిపారు. యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

**గిరిజన విద్యార్థుల భవిష్యత్తుపై చర్చ**

గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలపై సమావేశంలో ప్రాధాన్యతగా చర్చించినట్లు తెలిపారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు నిరంతర సహకారం అందితేనే గిరిజన సమాజంలో దీర్ఘకాలిక మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చర్చించారు. గిరిజన విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వృత్తి విద్య వైపు వారిని ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు.

**మహిళల సాధికారతకు ప్రాధాన్యం**

దళిత, ఆదివాసీ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడం, చిన్నతరహా వ్యాపారాలు, వ్యవసాయ ఆధారిత ఉపాధి, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చర్చించారు.

**ఆరోగ్య సేవల విస్తరణ అవసరం**

మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని కూడా ఎమ్మెల్యే ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచడం, అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలకు రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలు గిరిజన ప్రాంతాల ప్రజలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో దీర్ఘకాలిక అభివృద్ధికి పునాది వేయవచ్చని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిపారు.

**రాజ్యాంగ హక్కులపై అవగాహన**

దళిత, ఆదివాసీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ కార్యక్రమాలు, చట్టపరమైన రక్షణలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం, అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనాలు పొందలేకపోతున్న వారికి అధికార యంత్రాంగం ద్వారా సహకారం అందించడం అవసరమని పేర్కొన్నారు.

**అశ్వారావుపేట సమస్యలను జాతీయ వేదికపై ప్రస్తావించిన ఎమ్మెల్యే**

అశ్వారావుపేట నియోజకవర్గంలోని దళిత, ఆదివాసీ ప్రజల సమస్యలను ఢిల్లీ సమావేశం వేదికగా ప్రస్తావించడం ద్వారా స్థానిక సమస్యలకు జాతీయ స్థాయి చర్చల్లో స్థానం కల్పించే ప్రయత్నం చేసినట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రజా సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి విషయంలో స్థానిక అవసరాలను గుర్తించి, ప్రజలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**సమగ్ర అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం**

దళిత, ఆదివాసీ వర్గాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, సామాజిక సంస్థలు, యువత, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. సామాజిక సమానత్వం, విద్యా అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన దళిత--ఆదివాసీ సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను ప్రస్తావించడం నియోజకవర్గ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అశ్వారావుపేట నియోజకవర్గంలోని దళిత, ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ధరణి పేరిట రికార్డులు తారుమారు

**మా భూములను సర్వేనెంబర్ 325లో కలిపారు**

**సర్వేచేసి మా భూములు మాకు ఇప్పించండి**

**మంత్రి పొంగులేటికి వెంకటాపూర్ గ్రామస్థుల వేడుకోలు**

**క్షేత్రస్థాయి సర్వేతో వాస్తవాలు తేలుస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**భూ సమస్యపై సమగ్ర విచారణకు మంత్రి హామీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేలు నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా తమ భూములపై హక్కులు లేకుండా చేశారని, తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పటాలను కూడా రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి ప్రభుత్వంలో అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్కులను తీసుకున్నారని, అయితే కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు మంత్రికి వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి, గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, రికార్డులు--పాత పాస్‌బుక్కులు--గ్రామ నక్షా--క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. అదేవిధంగా దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్, సర్వే ఒ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు

**గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి**

**ఇన్వెస్టర్స్ సద్వినియోగం చేసుకోవాలి**

**తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ వెల్లడి**

**తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటన**

**భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భేటీ**

**వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చ**



ఫ్రాంక్‌ఫర్ట్, సెప్టెంబర్ 29(ప్రజాజ్యోతి): జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు. "ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ తిరుపతి, లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు. జర్మనీ–భారత పార్లమెంటరీ మైత్రి కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్ లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ లో ఈ బృందం పర్యటించనుంది. వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్ గారు, శాసన మండలి చైర్మన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుంది. సెప్టెంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ జరిగింది. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది. విదేశీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధి బృందం ఆయా దేశాల పార్లమెంట్లను సందర్శించి, అక్కడి పార్లమెంటరీ విధానాలను పరిశీలిస్తుంది.

# డిసిసిబి సింహాసనం పై తీవ్ర ఉత్కంఠ: డీసీసీబీ పీఠం దక్కేది ఎవరికి?

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి : ఉమ్మడి ఖమ్మం జిల్లా సహకార రాజకీయాలు ప్రస్తుతం అత్యంత ఆసక్తికర ఘట్టానికి చేరుకు




న్నాయి. ఉమ్మడి జిల్లా రైతులకు,సహకార రంగానికి కీలకమైన ఖమ్మం డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ ) చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది.ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్గానికి చెందిన ఇద్దరు ముఖ్య నాయకులు ఈ పీఠంపై కన్నేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈసారి డీసీసీబీ చైర్మన్ పదవిని సామాజిక న్యాయ సూత్రాల ఆధారంగా బీసీ వర్గానికి కేటాయించాలనే డిమాండ్ పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. జిల్లాలోని రైతుల్లో,సహకార సంఘాల సభ్యుల్లో మెజారిటీగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేయడం ద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి రాజకీయంగా పెద్ద ప్రయోజనం చేకూరుతుందని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. తుమ్మల వర్గంలో రేసులో ఉన్న ఇరువురు కీలక నేతలు. డీసీసీబీ పీఠాన్ని ఆశిస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వద్ద ప్రధానంగా ఇద్దరు నాయకులు గట్టిగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మంత్రి తుమ్మలకు అత్యంత విశ్వాసనీయ అనుచరుడిగా ఉంటూ తన రాజకీయ ప్రస్థానంలో ఎటువంటి ఆరోపణ లేకుండా తుమ్మల వర్గంలో నీతి, నిజాయితీగా పనిచేస్తూ కొనసాగుతున్న ముదిగొండ సహకార సంఘం ( పిఎసిఎస్ ) చైర్మన్ సహకార రంగంలో సుదీర్ఘ అనుభవం,గ్రామీణ ప్రాంత రైతులతో నేరుగా సంబంధాలు ఉండటం ఈయనకు కలిసివచ్చే ప్రధాన అంశం.క్షేత్రస్థాయి నుంచి రైతు సమస్యలపై అవగాహన ఉండటం వల్ల బ్యాంకును సమర్థవంతంగా నడపగలరనే నమ్మకంతో ఈయన వైపు ఒక వర్గం మొగ్గు చూపుతోంది. పార్టీ



కార్యక్రమాల్లో ఖమ్మం టౌన్ కార్పొరేటర్ చురుగ్గా పాల్గొంటూ,పట్టణ ప్రాంతంలో గట్టి పట్టు సాధించిన రాజకీయ నాయకుడు.మంత్రి తుమ్మల వర్గములో మంచి కీలక నేతగా నియోజకవర్గ స్థాయి రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇరువురు తుమ్మల నాగేశ్వరరావుకు వర్గానికి చెందిన నాయకులే కనుక డిసిసిబి పీఠం ఎవరిని వరుస్తుందో త్వరలోనే తేలుతుంది.

# హిందూ దేవతలను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదు

**–సీఎం రేవంత్ రెడ్డి హిందువులకు, మోడీకి కృష్ణ క్షమాపణ చెప్పాలి**

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 29 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రంలో ఎక్కడ తమకు వ్యతిరేకత ఏర్పడుతుందన్న భయంతో ఏమైనా వ్యాఖ్యలు చేస్తే రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారుతుందన్న దురుద్దేశంతో భారత ప్రధాని



నరేంద్ర మోదీ ఎక్కడైనా ఏ సభలోనైనా జై శ్రీరామ్ అని అంటారు కానీ హర హర మహాదేవ అని శివుడిని స్మరించిన రోజు ఒక్కటన్న ఉందా అని బిజెపికి శివుడు నచ్చరని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను కించపరచడమే అని భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు అన్నారు. మంగళవారం ప్రధాని మోదీ ఎక్కడైనా ఎప్పుడైనా జై శ్రీరామ్ అని అంటారు తప్ప శివుడిని ఒక్కసారైనా స్మరించారా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని స్థానిక స్వామి వివేకానంద చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం సరిపోదంటూ ఒక మతంలో చిచ్చు పెడితే అది చర్చనీయాంశంగా మారుతుందన్న దురుద్దేశంతో ప్రధాని మోదీ ఎక్కడైనా ఎప్పుడైనా జై శ్రీరామ్ అని అంటారు తప్ప శివుడిని ఒక్కసారైనా స్మరించారా అంటూ హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు తాము ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చు అందులో తప్పు లేదని కానీ ప్రజలను మధ్య పెట్టే ప్రయత్నం చేయడం గానీ వారిని తప్పుదోవ పట్టించే దించే విధంగా తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని మోదీ పట్ల మీరు చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను సహించబోమని హెచ్చరించారు. ప్రధాని మోదీ జైశ్రీరామ్ అంటూ ఉంటారని, అయితే ఆయన శివుడికి వ్యతిరేకమా అని ప్రశ్నించడం హిందువుల మనోభావాలను దెబ్బ కొట్టడమేనని అన్నారు. హిందువులకు శ్రీరాముడు శ్రీ కృష్ణుడు తిరుపతి వెంకటేశ్వర స్వామి,యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఇలా అనేక రూపాలలో దేవి దేవతలను కొలవడం అనాదిగా వస్తున్న ఆచారం అని దానిని ముఖ్యమంత్రి తప్పు పట్టడం మంచిది కాదన్నారు. కేవలం ముస్లింల ఓట్ల కోసమే ఆనాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ వారిని నెత్తిన ఎక్కించుకుంటూ ఉందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి గానీ కాంగ్రెస్ పార్టీకి గానీ వారి ఇష్టానుసారం ఏం చేసినా పర్వాలేదు కానీ హిందువుల మనోభావాలను




కించపరిచే విధంగా మాట్లాడిన తెలంగాణ ప్రజలు సహనంతో ఉండి సమయం వచ్చినప్పుడు తప్పకుండా మీకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి మీ వ్యక్తిగతంగా ఏం చేసుకున్న తమకు సంబంధం లేదని, రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూసినా ఢిల్లీ పెద్దలతో మార్కులు కొట్టేయాలని హిందూ దేవుళ్లను హిందూ మతాన్ని కించపరిస్తే తెలంగాణ ప్రజలు చూస్తూ సహించేది లేదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కనకరాజు,మక్తల్ మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి,మాగనూరు మండల అధ్యక్షుడు జయానాథ్ రెడ్డి,కృష్ణ మండల అధ్యక్షుడు నర్సప్ప,కావాలి వెంకటేష్ ,ఆడం సత్యనారాయణ,రాఘవేందర్ చీరాల సత్యనారాయణ,మంతన్ గౌడ్ శంకర్,మల్లేష్ ,నరేందర్ సాగర్,లింగంపల్లి, లక్ష్మణ్,బట్టి మహాదేవ్,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మయన్మార్‌లో వైమానిక దాడి..

మొదటిపేజీ తరువాయి..

అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యాక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతులలో



మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్యూన్ ఆంగ్ మృతుల సంఖ్యను ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం, వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యాక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

**పేదల కన్నీటికి**

# విలువ కట్టలేం..



మొదటిపేజీ తరువాయి..

అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియోజకవర్గాల్లో భూములను



గుర్తించామని, సుమారు 16--17 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్ట్‌మెంట్ విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు, మూడు సంవత్సరాల సమయం తీసుకోకుండా ఒక ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి, ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం సర్టిఫికెట్లు ఇచ్చి వదిలేయకుండా.. అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమిషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీని మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారిస్తామని చెప్పారు. వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం కల్పించి, తమ ఇల్లు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వాలు నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 30--40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తుందని మంత్రి అన్నారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాకుండా, ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎంపికైన 480 మంది లబ్ధిదారులకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో రెండో, మూడో, నాలుగో విడతలను ప్రారంభించి, ఎన్నికలలోపు నాలుగు విడతల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి పొంగులేటి లక్కీడ్రాలో విజేతలైన లబ్దిదారులకు ఇళ్ల నెంబర్ల కేటాయిస్తూ వారి పేర్లను ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా మాదేసు లత అనే మహిళకు డ్రాలో ఇందిరమ్మ ఎ టవర్ లోని 801 ఇంటిని కేటాయిస్తూ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎండీ విపి గౌతమ్, కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.

# తోటి సైనికులపై విచక్షణారహితంగా కాల్పులు

మొదటిపేజీ తరువాయి..

జవాన్, నలుగురు తోటి జవాన్లను విచక్షణారహితంగా కాల్చిచంపాడు. ఈ ఘటనలో నలుగురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వెంటనే అప్రమత్తమైన ఇతర జవాన్లు, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక జవాన్ల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదమే ఈ కాల్పులకు దారితీసినట్లు తెలుస్తోంది. సహచరులతో వాగ్వివాదానికి దిగిన నిందితుడు తీవ్ర ఆవేశంతో ఈ దారుణానికి పాల్పడినట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న సీనియర్ పోలీసు, సీఐఎస్ఎఫ్ అధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.









Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967